

# వార్త వేకువ

తెలుగు దినపత్రిక

నిజం వైపు నిరంతరం...


PRGI No: TGTEL/26/A2290








ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : ఆవనగంటి అనిల్ కుమార్ సంపుటి : 01 సంచిక : 103 వెల : 4 పేజీలు : 08 మంగళవారం 11 - 08 - 2026


## ఝార్ఖండ్‌లో విద్యార్థుల
# ఆందోళన ఉద్రిక్తం



- బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు
- వాటర్ కేనన్‌ల ప్రయోగం
- బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్
- అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు
- పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు
- 13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

**వార్త వేకువ ,ఝార్ఖండ్ , ఆగస్టు 10 :** ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు - మిగతా 2 లో

## భారత రుతుపవనాలకు
# 'డాల్ఫిన్' దెబ్బ




- దేశంలో బలహీనపడుతున్న రుతుపవనాలకు కారణమవుతున్న డాల్ఫిన్ టైఫూన్
- పసిఫిక్ మహాసముద్రంలో మార్పులతో బంగాళాఖాతంలో తగ్గిన అల్పపీడనాలు
- దాదాపు 4,000 కిలోమీటర్ల దూరం నుంచే వాతావరణంలో మార్పులు

# మనిషి 200 ఏళ్లు బతకొచ్చు!

- శాస్త్రవేత్తల కొత్త సిద్ధాంతం, కానీ ఒక్క అడ్డంకిని అధిగమిస్తేనే!
- వృద్ధాప్య ప్రక్రియను అడ్డుకుంటే మనిషి 200 ఏళ్లకు పైగా జీవించవచ్చని అంచనా
- శరీరం కోలుకునే సహజ సామర్థ్యాన్ని కాపాడటమే కీలకమని పరిశోధకుల వెల్లడి
- ప్రస్తుతం 120-150 ఏళ్ల మధ్య ఈ శక్తి పూర్తిగా నశిస్తోందని గుర్తింపు
- డీఎన్ఏ డ్యామేజ్, ఇన్‌ఫ్లమేషన్ వంటివి సరిచేయగల సమస్యలేనని వెల్లడి
- గుండె, మెదడులో జన్యు మార్పులే అసలైన అడ్డంకి అని స్పష్టీకరణ



**వార్త వేకువ ,ఢిల్లీ, ఆగస్టు 10 :** వృద్ధాప్యానికి దారితీసే కొన్ని కీలక జీవసంబంధ ప్రక్రియలను - మిగతా 2 లో

## తమిళ గీతానికే
# తొలి ప్రాధాన్యం

- తమిళనాడు రాష్ట్ర గీతంపై అసెంబ్లీ తీర్మానం
- ప్రభుత్వ కార్యక్రమాల్లో మొదటగా 'తమిళ తాయ్ వాళ్తు'ను పాడాలని అసెంబ్లీలో తీర్మానం
- సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానానికి డీఎంకే, అన్నాడీఎంకే సహా అన్ని పార్టీల మద్దతు
- ఇది తమిళ అస్తిత్వానికి దక్కిన చారిత్రక గౌరవమని పేర్కొన్న సీఎం విజయ్
- అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన సీఎం విజయ్



**వార్త వేకువ ,చెన్నై, ఆగస్టు 10 :** తమిళనాడు శాసనసభ సోమవారం ఒక చారిత్రక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వహించే అధికారిక కార్యక్రమాలను ఇకపై తప్పనిసరిగా రాష్ట్ర గీతమైన 'తమిళ తాయ్ వాళ్త'తోనే ప్రారంభించాలని - మిగతా 2 లో

## నాగార్జునసాగర్‌లో
# వరుణయాగం

- పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు
- నాగార్జునసాగర్‌లో విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో వరుణయాగం
- 11 హోమ గుండాలతో 108 మంది రుత్వికులు ఈ క్రతువును నిర్వహించారు
- హాజరైన మంత్రులు, ముఖ్యనేతలు



**వార్త వేకువ , హైదరాబాద్, ఆగస్టు 10 :** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో వరుణయాగం నిర్వహించింది. సాగర్‌లోని విజయ్ విహార్ ప్రాంగణంలో ఇవాళ తెల్లవారుజామున 4 గంటలకు యాగ క్రతువు ప్రారంభం అయింది. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు సూచించిన మేరకు 11 హోమ గుండాలతో 108 మంది రుత్వికులు ఈ క్రతువును నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ వైదిక క్రతువు వైభవోపేతంగా సాగింది. వరుణయాగం చివర్లో - మిగతా 2 లో



## బండి సంజయ్ బతుకంతా
# మత రాజకీయమే

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- బోనాల పండుగలను బీజేపీ నేతలు రాజకీయాలకు వాడుకుంటున్నారన్న ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని వ్యాఖ్య
- మహంకాళి అమ్మవారికి రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారన్న శ్రీనివాస్

**వార్త వేకువ , హైదరాబాద్, ఆగస్టు 10 :** కేంద్ర మంత్రి బండి సంజయ్ బతుకంతా మతం పేరు చెప్పుకుని రాజకీయం చేయడమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా - మిగతా 2 లో

## డబుల్ బెడ్‌రూమ్
# ఇళ్ల పంపిణీలో రగడ



- మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి
- హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వాదం
- గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు
- ఇరువర్గాల నినాదాలతో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

**వార్త వేకువ , హైదరాబాద్, ఆగస్టు 10 :** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల - మిగతా 2 లో



## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ నిరసన దీక్షలు
- తాడిపత్రికి వెళుతున్న పెద్దిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డిలను అడ్డుకున్న పోలీసులు
- ఇద్దరినీ అదుపులోకి తీసుకుని అనంతపురంకు తరలించిన పోలీసులు

**వార్త వేకువ , అమరావతి, ఆగస్టు 10 :** డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నిరసన ర్యాలీలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిరసనల్లో పాల్గొనేందుకు అనంతపురం జిల్లా తాడిపత్రికి వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిలను పోలీసులు ముచ్చుకోట వద్ద అడ్డుకున్నారు. తాడిపత్రికి - మిగతా 2 లో

## కలిదిండిలో
# 'మీ భూమి-మీ హక్కు'



- పట్టాదారు పాస్ బుక్ లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- ఏలూరు జిల్లాలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలు ఆదరిస్తారని వ్యాఖ్య
- భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న ముఖ్యమంత్రి

**వార్త వేకువ , అమరావతి, ఆగస్టు 10 :** ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించినప్పుడే జనం జై కొడతారని, లేకపోతే గత పాలకులకు పట్టిన - మిగతా 2 లో

## పట్టాదారు పాస్ పుస్తకాలకు
# కరెన్సీ నోట్ల ఫీచర్లు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు ఇస్తున్నాం
- పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా తయారుచేశాం
- క్యూఆర్ కోడ్ కొడితే మీ సెల్‌ఫోనే మీ భూమి వద్దకు తీసుకెళ్తుంది
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**వార్త వేకువ , అమరావతి, ఆగస్టు 10 :** ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఏకైక అజెండా అని సీఎం చంద్రబాబు అన్నారు. సుపరిపాలనే తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కలిదిండిలో చంద్రబాబు పర్యటించారు. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. "ప్రధాని మోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌లో పరుగెడుతోంది. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అధికారులు గట్టిగా పని చేయాల్సిందే. పట్టాదార్ పాస్ పుస్తకంపై వేరే వాళ్ల ఫొటో వేసుకుంటే ఊరుకుంటామా గత ప్రభుత్వ విధ్వంసం వల్ల అనేక సమస్యలు వచ్చాయి. భూసమస్యలపైనే ఎక్కువ అర్జీలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లో భూసమస్యలను పరిష్కరించాలని అనుకున్నాం." "సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు. లేకపోతే - మిగతా 2 లో

వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
మంగళవారం 11 - 08 - 2026

# పట్టాదారు పాస్ పుస్తకాలకు కరెన్సీ నోట్ల ఫీచర్లు



**మొదటిపేజీ తరువాయి -** చూశాం కదా 11కి పరిమితం చేశారు. బటన్ నొక్కడం, పరదాల చాటున రావడం, సభలు పెట్టి చెట్లు నరికేయటం గత పాలకులు చేశారు. కానీ మేం ప్రతీ నెలా ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఈ సమావేశాల ద్వారా ప్రజల్ని కలుస్తున్నాం. కరెన్సీ నోట్లకు ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉంది" అని చంద్రబాబు వివరించారు."7450 గ్రామాల్లో 32 లక్షల 22 వేల 346 పాస్‌పుస్తకాలు ఇచ్చాం. పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా తయారుచేశాం. ఎవరైనా ట్యాంపర్ చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే తెలిసిపోతుంది. క్యూఆర్ కోడ్ కొడితే మీ సెల్‌ఫోనే మీ భూమి వద్దకు తీసుకెళ్తుంది. మరో ఏడు నెలల్లో మొత్తం పట్టాదార్ పుస్తకాలు పంపిణీ చేయాలి. 9,365 గ్రామాలు ఉన్నాయి, 68 లక్షల 64 వేలమందికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. ఇవాళ 2 వేలమందికి పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇచ్చాం. గుంతల పడిన రోడ్లను ఎక్కడికక్కడ సరిచేస్తున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు."ముఠా కక్షలు, రౌడీయిజాన్ని అణచివేశాం. రాయల సీమలో ముఠా కక్షలు లేకుండా రూపుమాపాం. రోడ్డుపైకి వచ్చి విన్యాసాలు చేస్తే ఊరుకోవాలా?. మేము కట్టిన ప్రాజెక్టులన్నీ జగన్ కట్టానని చెబుతున్నారు. గొడ్డలి పార్టీకి అభివృద్ధి ముఖ్యం కాదు, విధ్వంసమే వారికి కావాల్సింది. నేను రౌడీయిజం చేయను, రౌడీలకు సింహస్వప్నంగా ఉంటా. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఎవరినీ వదిలిపెట్టం. స్వర్ణాంధ్ర నిర్మాణానికి సంకల్పం చేశా. నేను అనే సంకల్పానికి అందరూ సిద్ధంకండి. ప్రజా సంకల్పానికి సహకారం అందించే బాధ్యత మాది. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. అభివృద్ధికి ఎవరైనా అడ్డొస్తే ఊరుకునేది లేదు. జాతీయ జెండా - మనసులో సంకల్పం అజెండా. నేను - నా దేశం దేశాభి వృద్ధిలో అందరూ భాగస్వాములే. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటండి.

# సంపాదకీయం

## డీప్‌ఫేక్‌ల నుంచి డిజిటల్ మోసాల వరకు

### (నమ్మకమే లక్ష్యంగా మారుతున్న కొత్త ముప్పు)

-హెచ్.ప్రతాప్



కృత్రిమ మేధస్సు ఆధునిక ప్రపంచాన్ని వేగంగా మార్చుతున్న సాంకేతిక విప్లవం. వైద్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమ, పరిశోధన, పరిపాలన వంటి రంగాల్లో ఇది కొత్త అవకాశాలకు తలుపులు తెరుస్తోంది. అయితే ఇదే సాంకేతికత దుర్వినియోగమైతే నిజాన్ని నకిలీగా, నకిలీని నిజంగా చూపించే ప్రమాదకర సాధనంగా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్‌లు, స్వర అనుకరణ, నకిలీ వీడియోలు, మోసపూరిత పెట్టుబడి ప్రకటనలు ప్రజల నమ్మకాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయి.తాజాగా పుణేలో వెలుగుచూసిన ఘటన ఈ ప్రమాదానికి స్పష్టమైన ఉదాహరణ. రతన్ టాటా పేరుతో రూపొందించిన డీప్‌ఫేక్ వీడియోను ఉపయోగించి ఒక మహిళను మోసం చేసి సుమారు రూ.4 లక్షలు దోచుకున్న ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కృత్రిమ మేధస్సుతో రూపొందించిన వీడియోను నిజమైనదిగా నమ్మిన బాధితురాలు మోసపోయినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.ఇది ఒక వ్యక్తి ఆర్థిక నష్టానికి సంబంధించిన ఘటనగా మాత్రమే చూడకూడదు. ప్రముఖుల ముఖాలు, స్వరాలు, హోదాలను అనుకరించి ప్రజల్లో విశ్వాసం కల్పించడం సైబర్ నేరాలకు కొత్త రూపాన్ని ఇస్తోంది. గతంలో నకిలీ లేఖలు, ఫోన్ కాల్స్, సందేశాలు మోసాలకు ఉపయోగపడితే, ఇప్పుడు మన కళ్లముందే కనిపించే వీడియోనే మోసానికి ఆధారంగా మార్చే పరిస్థితి వచ్చింది. అందుకే డిజిటల్ ప్రపంచంలో "చూశాను కాబట్టి నిజమే" అనే నమ్మకం ప్రమాదకరంగా మారుతోంది.ఈ ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ కూడా చట్టపరమైన చర్యలను బలోపేతం చేస్తోంది. 2026 ఫిబ్రవరిలో సవరించిన సమాచార సాంకేతిక నియమాల్లో లి"సింథటిక్‌గా రూపొందించిన సమాచారం"లికు ప్రత్యేక నిర్వచనం తీసుకొచ్చారు. నిజమైన వ్యక్తి లేదా సంఘటనలా కనిపించేలా కృత్రిమంగా లేదా అల్గారిథమ్‌ల ద్వారా రూపొందించిన, మార్చిన లేదా సవరించిన దృశ్య, శ్రవ్య సమాచారాన్ని ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. డీప్‌ఫేక్‌లు, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన లేదా మార్చిన చిత్రాలు, వీడియోలు, స్వర అనుకరణలు ఇందుకు ఉదాహరణలు. ఈ సవరణలు 2026 ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి వచ్చాయి.అయితే చట్టాలు మాత్రమే సరిపోవు. సామాజిక మాధ్యమ వేదికలు కృత్రిమంగా రూపొందించిన సమాచారాన్ని స్పష్టంగా గుర్తించే విధానాలను సమర్థంగా అమలు చేయాలి. సైబర్ నేరాల దర్యాప్తు సంస్థలకు ఆధునిక డిజిటల్ ఫోరెన్సిక్ సామర్థ్యాలు పెంచాలి. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ సాక్షరత, సమాచార ధృవీకరణ, మీడియా అవగాహనను విద్యలో భాగం చేయాలి.ఇదే సమయంలో డిజిటల్ అరెస్టుల వంటి మోసాలపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరాలు ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, వాటిని అత్యంత తీవ్రమైన నేరాలుగా చూడాల్సిన అవసరం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది.కృత్రిమ మేధస్సును ఆపడం పరిష్కారం కాదు. దాని ప్రయోజనాలను వినియోగించుకుంటూనే దుర్వినియోగాన్ని అడ్డుకునే చట్టం, సాంకేతికత, నైతిక బాధ్యత, ప్రజల అప్రమత్తత అనే నాలుగు రక్షణ వలయాలు అవసరం.డిజిటల్ యుగంలో మనిషి వద్ద ఉన్న అత్యంత విలువైన ఆస్తి కేవలం సమాచారం కాదు---సత్యంపై ఉన్న నమ్మకం. ఆ నమ్మకం దెబ్బతింటే సాంకేతిక పురోగతికే అర్థం ఉండదు. అందుకే నేటి అత్యవసర ప్రశ్న ఒక్కటే---

**"కృత్రిమ మేధస్సు ఎంత తెలివైనది?" కాదు...**

**"మనం చూస్తున్నది నిజమని ఎలా నిర్ధారించాలి?"**

## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**మొదటిపేజీ తరువాయి -** వెళ్లేందుకు అనుమతి లేదని వీరికి పోలీసులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో, పోలీసుల తీరును నిరసిస్తూ వైసీపీ నేతలు అక్కడే బైఠాయించారు. దీంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డిలను అదుపులోకి తీసుకుని పోలీసులు... వారిని అక్కడి నుంచి అనంతపురంకు తరలించారు.

## తమిళ గీతానికే తొలి ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి -** ఈ తీర్మానం స్పష్టం చేస్తోంది. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీజేపీ సహా సభలోని అన్ని పక్షాలు దీనికి సంపూర్ణ మద్దతు తెలిపాయి. అనంతరం మూజువాణి ఓటింగ్ ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ ప్రకటించారు.ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి విజయ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది తమిళ అస్తిత్వానికి, భాషా గౌరవానికి దక్కిన చారిత్రక విజయమని ఆయన అభివర్ణించారు. "తమిళం కేవలం ఒక భాష కాదు, అది ఒక ఆలోచన, సంస్కృతి, నాగరికత, జీవన విధానం, చైతన్యం" అని ఆయన పేర్కొన్నారు. 1891లో మనోన్మణియం సుందరనార్ రచించిన 'మనోన్మణియం' నాటకం నుంచి ఈ గీతాన్ని స్వీకరించారు. 1970 నుంచే ప్రభుత్వ కార్యక్రమాల్లో దీనిని ఆలపిస్తున్నప్పటికీ, 2021లో అధికారికంగా రాష్ట్ర గీతంగా గుర్తించారు. ఈ తీర్మానం అమలుకు ఎలాంటి బాహ్య అనుమతులు అవసరం లేదని స్పీకర్ స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని మొదటగా ఆలపించాలని జూలై 9న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సూచనలు జారీ చేసిన నేపథ్యంలో ఈ తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో ఇతర గీతాల తర్వాత 'తమిళ తాయ్ వాళ్తు'ను పాడటం రాష్ట్రంలో రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం భాషా, సాంస్కృతిక హక్కులను పునరుద్ఘాటిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.

## నాగార్జునసాగర్‌లో వరుణయాగం



**మొదటిపేజీ తరువాయి -** జరిగే పూర్ణాహుతితో యాగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.నదులు పరవళ్లు తొక్కాలని – రైతాంగం సుభిక్షంగా ఉండాలని : సాగర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, చెరువులు నిండాలని, కృష్ణా, గోదావరి నదులు పరవళ్ళు తొక్కాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ వరుణయాగం నిర్వహించినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతాంగ ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని మంత్రి ఉత్తమ్ వివరించారు. ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటూనే, సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రకృతి అనుగ్రహాన్ని కూడా కోరుకుంటున్నామని మంత్రి చెప్పారు.పూర్ణాహుతి అనంతరం ముఖ్యమంత్రి నాగార్జున సాగర్ డ్యామ్‌ను పరిశీలించారు. జలాశయంలో డెడ్ స్టోరేజ్‌కు చేరిన నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరుణయాగంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు'

**మొదటిపేజీ తరువాయి -** గతే పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేవలం బటన్లు నొక్కి, పరదాల చాటున తిరిగితే ప్రజలు ఆదరించరని, అందుకే గత ప్రభుత్వాన్ని 11 సీట్లకే పరిమితం చేశారని పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏలూరు జిల్లా కలిదిండిలో సోమవారం నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, సుపరిపాలన అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌తో పనిచేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల వల్ల భూ సమస్యలు తీవ్రమయ్యాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరిష్కరించి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రీసర్వే చేపట్టినట్లు చంద్రబాబు వివరించారు. కొత్తగా అందిస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాలకు కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లతో పాటు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక సాంకేతికతను జోడించామన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు.ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 9,365 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేసి, 32.32 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశామని, మరో 68.64 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేయాల్సి ఉందని చంద్రబాబు వెల్లడించారు. ప్రతి నెలా ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## మనిషి 200 ఏళ్లు బతకొచ్చు!

**మొదటిపేజీ తరువాయి -** నియంత్రించగలిగితే, మానవులు 200 ఏళ్లు దాటి జీవించడం సాధ్యమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సగటు ఆయుష్షు 146 నుంచి 194 ఏళ్లకు పెరగవచ్చని, కొందరు 200 ఏళ్ల మార్కును కూడా దాటవచ్చని వారి సైద్ధాంతిక నమూనాలు అంచనా వేస్తున్నాయి.ఒత్తిడి, అనారోగ్యం, కణాల స్థాయిలో జరిగే నష్టం నుంచి శరీరం కోలుకునే సహజ సామర్థ్యంపై ఈ పరిశోధన దృష్టి సారించింది. దీనినే 'ఫిజియోలాజికల్ రెసిలియెన్స్' అంటారు. వయసు పెరిగేకొద్దీ ఈ శక్తి క్రమంగా తగ్గిపోయి, సుమారు 120 నుంచి 150 ఏళ్ల మధ్య పూర్తిగా నశించిపోతుందని పరిశోధకులు గుర్తించారు. ఆ దశ తర్వాత చిన్న అనారోగ్యం కూడా ప్రాణాంతకంగా మారుతుంది.అయితే, కణాల మరమ్మతు వ్యవస్థలను కాపాడుకోవడం ద్వారా ఈ పరిస్థితిని మార్చవచ్చని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. జీవక్రియల పనితీరులో లోపాలు, సరిచేయగల డీఎన్ఏ డ్యామేజ్, కణాల వృద్ధాప్యం, దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్ వంటి అంశాలను నియంత్రించడంపై దృష్టి పెడితే ఆయుష్షును గణనీయంగా పెంచవచ్చని వారు పేర్కొంటున్నారు.కానీ, ఈ మార్గంలో ఒక పెద్ద అడ్డంకి ఉందని కూడా ఈ పరిశోధన స్పష్టం చేస్తోంది. అదే గుండె, మెదడు వంటి కీలక అవయవాల్లో నెమ్మదిగా పేరుకుపోయే జన్యుపరమైన మార్పులు (మ్యుటేషన్లు). ఈ అవయవాలకు పునరుత్పత్తి సామర్థ్యం చాలా తక్కువగా ఉండటంతో, ఈ మార్పులను సరిచేయడం దాదాపు అసాధ్యం. ఇతర వృద్ధాప్య ప్రక్రియలను ఆపగలిగినా, ఈ జన్యు మార్పులు చివరికి అవయవాల పనితీరును దెబ్బతీసి, ఆయుష్షుకు గరిష్ఠ పరిమితిని నిర్దేశిస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం ఈ అంచనాలన్నీ సైద్ధాంతికమేనని వారు స్పష్టం చేశారు.

## ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం

**మొదటిపేజీ తరువాయి -** ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది.నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు.అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.

### 16 రోజులుగా ఆందోళన

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

## భారత రుతుపవనాలకు 'డాల్ఫిన్' దెబ్బ

**మొదటిపేజీ తరువాయి -** చైనా తూర్పు తీరాన్ని వణికిస్తున్న 'డాల్ఫిన్' టైఫూన్ ప్రభావం సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత రుతుపవనాలపై పడుతోంది. ఈ టైఫూన్ వల్ల దేశానికి ప్రత్యక్షంగా ఎటువంటి ముప్పు లేనప్పటికీ, దీని కారణంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు రుతుపవన వ్యవస్థను బలహీనపరుస్తున్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తిమంతమైన టైఫూన్‌గా డాల్ఫిన్‌ను వాతావరణ శాఖ గుర్తించింది. ఆగస్టు 9న జెజియాంగ్ ప్రావిన్స్‌లోని యుహువాన్ సమీపంలో గంటకు 151 కిలోమీటర్ల వేగంతో వీచిన పెను గాలులతో ఇది తీరాన్ని దాటింది. ఈ టైఫూన్ ధాటికి చైనా ప్రభుత్వం సుమారు పది లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, పలు చోట్ల భారీ వర్షాలు, వరదలు సంభవించాయి.అయితే, ఈ టైఫూన్ ప్రభావం భారత్‌పై పరోక్షంగా పడుతోంది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో నెలకొన్న అలజడి, ఎల్ నినో తరహా పరిస్థితులు కారణంగా వాతావరణ కదలికలు తూర్పు వైపునకు మళ్లుతున్నాయి. ఇది హిందూ మహాసముద్ర ప్రాంతంలోని వాతావరణ స్థితిగతులను ప్రభావితం చేస్తోంది. ఫలితంగా, భారత రుతుపవనాలకు కీలకమైన బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడకపోవడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి.డాల్ఫిన్ టైఫూన్ నేరుగా మన వర్షాలను నియంత్రిస్తోందని చెప్పలేమని, అయితే పసిఫిక్ సముద్రంలో చోటుచేసుకుంటున్న విస్తృత వాతావరణ మార్పులలో ఇది ఒక భాగమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడితేనే రుతుపవనాలు మళ్లీ పుంజు కుంటాయని, లేని పక్షంలో వర్షపాతంపై ప్రతికూల ప్రభావం కొనసాగే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

## బండి సంజయ్ బతుకంతా మత రాజకీయమే

**మొదటిపేజీ తరువాయి -** నిలిచే బోనాల పండుగను కూడా బీజేపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగను ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించిందని, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారని గుర్తుచేశారు. బోనాల ఏర్పాట్లపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవించే లౌకిక ప్రభుత్వమని స్పష్టం చేశారు.హిందూ ధర్మాన్ని, ప్రాచీన ఆలయాలను కాపాడేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పునర్నిర్మాణానికి రూ.250 కోట్లు, బాసరకు రూ.225 కోట్లు, భద్రాచలానికి రూ.351 కోట్లు, గోదావరి పుష్కరాల అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించామని వివరించారు. అలాగే మొయినాబాద్, వేములవాడలలో రూ.197 కోట్లతో ఆధునిక గోశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆలయాల అభివృద్ధికి ఇంత భారీగా నిధులు కేటాయించారా? అని ప్రశ్నించిన ఆయన.. సంజయ్‌కి చేతనైతే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు.ద

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ



**మొదటిపేజీ తరువాయి -** పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు.మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి. ఇది రాజకీయాలు చేసే వేదిక కాదు, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన చోటు" అని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మంత్రులపై ఆగ్రహం వెలిబుచ్చారు.ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# 6 వేల కిలోమీటర్లు ప్రయాణించి చైనాను తాకిన ప్రచండ టైఫూన్ 'డాల్ఫిన్'

**10 లక్షల మందికి పైగా తరలింపు**

**తూర్పు చైనాను అతలాకుతలం చేస్తున్న డాల్ఫిన్ టైఫూన్**

**10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు**

**వేలాది విమానాలు, రైళ్లు రద్దు.. స్తంభించిన జనజీవనం**

**ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన తుఫాను ఇదే**

**రాజధాని బీజింగ్ సహా 10 ప్రావిన్సులకు భారీ వర్షాల హెచ్చరిక**



ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన టైఫూన్ 'డాల్ఫిన్' తూర్పు తీర ప్రాంతంలో ప్రళయం సృష్టిస్తోంది. ఆదివారం సాయంత్రం తీరం దాటిన ఈ టైఫూన్ కారణంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు 10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. టైఫూన్ ప్రభావంతో రవాణా, పర్యాటక రంగాలు పూర్తిగా స్తంభించిపోయాయి.ఆదివారం సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో జెజియాంగ్ ప్రావిన్స్‌లోని యుహువాన్ నగరం సమీపంలో డాల్ఫిన్ టైఫూన్ తీరాన్ని తాకింది. ఆ సమయంలో గంటకు 151 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచాయి. గంట వ్యవధిలోనే సమీపంలోని వెన్‌జౌ నగరం వద్ద రెండోసారి తీరం దాటింది. దీంతో అధికారులు దేశంలోనే అత్యున్నత స్థాయి 'రెడ్ అలర్ట్' జారీ చేశారు. టైఫూన్ తీరం దాటినప్పటికీ, దాని ప్రభావం కొనసాగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.అధికారులు చేపట్టిన సహాయక చర్యలు మునుపెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఉన్నాయి. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 9 లక్షల మందిని, తైజౌలో 3.90 లక్షల మందిని, ఫుజియాన్ ప్రావిన్స్‌లో 1.67 లక్షల మందిని, షాంఘైలో 2.15 లక్షల మందికి పైగా ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి ఖాళీ చేయించారు. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 1,500 అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.టైఫూన్ కారణంగా రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఒక్క షాంఘైలోనే సుమారు 1,500 విమాన సర్వీసులు రద్దయ్యాయి. హ్యాంగ్‌జౌ విమానాశ్రయంలోనూ వందలాది విమానాలు నిలిచిపోయాయి. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 686 రోడ్డు మార్గాలు, 658 రైలు సర్వీసులను నిలిపివేశారు. పోర్టులు, ఫెర్రీ సేవలు కూడా మూతపడ్డాయి. షాంఘైలోని ప్రఖ్యాత లెగోలాండ్ రిసార్ట్‌ను తాత్కాలికంగా మూసివేశారు. అలాగే, 234 ప్రధాన పర్యాటక కేంద్రాలను మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.దాదాపు 6,000 కిలోమీటర్లు ప్రయాణించి చైనాను తాకడం ఈ టైఫూన్ ప్రత్యేకత. జులై చివరిలో మార్షల్ దీవుల వద్ద ఏర్పడిన ఈ టైఫూన్, చైనాకు రాకముందు జపాన్‌లోని ఒకినావా, ఫిలిప్పీన్స్ దేశాలపై కూడా తన ప్రభావాన్ని చూపింది. సోమవారం నాటికి టైఫూన్ బలహీనపడినా, ఇది దేశంలోని లోతట్టు ప్రాంతాల వైపు కదులుతోంది. దీనివల్ల రాజధాని బీజింగ్‌తో సహా 10కి పైగా ప్రావిన్సులలో రాబోయే రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని జాతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బీజింగ్‌లో ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసి, వరద నియంత్రణ చర్యలు చేపట్టారు. నదులు, పర్వత ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. జెజియాంగ్‌లో ఒక బాలుడు గల్లంతైనట్లు ప్రాథమిక సమాచారం ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు అధికారిక ప్రకటన రాలేదు.

వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
మంగళవారం 11 - 08 - 2026

## కార్మికుల జీవితాలతో చెలగాటమాడే లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి



**తుర్కపల్లి, ఆగస్టు 10 (వార్త వేకువ) :** కార్మికుల జీవితాలతో చెలగాటమాడే లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు పోతరాజు జహంగీర్ డిమాండ్ చేశారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫై చేస్తూ కార్మికుల హక్కులను కాల రాసిందని, రోజువారి పనిగంటలను ఎనిమిది గంటల నుండి 12 గంటల వరకు పెంచడం హైర్ అండ్ ఫైర్ విధానాలు తీసుకురావడం, కనీస వేతనాలు, సామాజిక భద్రతను పక్కన పెట్టడాన్ని తీవ్రంగా నిరసించినట్టు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విదేశీ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయి రైతులు దివాలా తీస్తున్నారని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా పంటల వ్యయం పై 50 శాతం కలిపి మద్దతు ధరలు ఇవ్వాలని రుణ యోజన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వెంకటేశం ,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు తలారి మాతయ్య, భవన నిర్మాణ రంగం జిల్లా నాయకులు గడ్డమీది నరసింహ, మహిళా సంఘం మండల కార్యదర్శి ఆవుల కలమ్మ, సిఐటియు గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు ఎరుకల స్వామి గౌడ్, నాయకులు మంత్రి నరసింహ, డి సురేష్, సిహెచ్ దానయ్య పాల్గొన్నారు

# కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి..

### ఎండి జహంగీర్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

**చౌటుప్పల్,ఆగష్టు10 (వార్త వేకువ)** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని చౌటుప్పల సిఐటియు,రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో"జైల్ భరో"కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జహంగీర్ విచ్చేసి మాట్లాడుతూ. కేంద్రం లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల, కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తుందని అన్నారు.లేబర్ కోడుల అమలుకు ఫైనల్ రూల్స్ ను నోటిఫై చేసిందని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్టానికి సవరణలు,రోజువారి పని దినాన్ని ఎనిమిది గంటల నుండి 12 గంటలకు పెంచేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని అన్నారు.సామాజిక భద్రత కోడ్,వృత్తి సం బంధిత రక్షణ,ఆరోగ్య,పని పరిస్థితుల కోడులతో భవన నిర్మాణం,హ మాలీలు, ట్రాన్స్ పోర్ట్,బీడీ తదితర అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని గాలికి



వదిలేసిందని విమర్శించారు.లేబర్ కోడ్స్ అమలు అయితే తరత రాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు, కార్మిక వర్గం కోల్పోయిన 4 లేబర్ కోడ్లను ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని హెచ్చ రించారు. వ్యవసాయ కార్మి కులు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న టువంటి సమస్యలపై ఈరోజు దేశవ్యాప్తంగా" జైల్ భరో"కార్యక్రమం భాగంగా చౌటుప్పల్ లో అన్ని కార్మిక సంఘాల ఆధ్వ ర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ధర్నాను నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి,సిఐటియు జిల్లా కోశాధికారి ఎండి పాషా,



వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగంగాదేవి సైదులు, కార్మిక సంఘాల నాయకులు చీక అలివేలు,గోశిక కరుణాకర్, చీరిక సంజీవరెడ్డి,ఆదిమూల నందీశ్వర్, చీమకళ్ళ శ్రీరాములు, జొన్నకంటి దేవయ్య,చింతల సుదర్శన్,ఆకుల ధర్మయ్య, బాతరాజు దశరథ,యాట బాలరాజు,కొంతం శ్రీనివాస్ రెడ్డి,చెరుకు లక్ష్మమ్మ, జక్కిడి అంజిరెడ్డి,యాట వెంకటేశం,తోర్పునూరి మల్లేశా, కొండ శ్రీశైలం,మీసాల శ్రీను,యాదయ్య, మల్లమ్మ, జ్యోతి, నం ˊసింహ, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి,మాంద్ర కోటయ్య,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గోకులం యాదవ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**గౌరవ అధ్యక్షులు:బింగి జంగయ్య యాదవ్ (మాజీ కార్పొరేటర్),రసాల వెంకటేష్ యాదవ్.**

**సంఘ బలోపేతానికి,సమాజ సేవకు నిరంతరం కృషి వ్యవస్థాపక అధ్యక్షుడు: ముదేతుల మల్లేష్ యాదవ్.**





**మేడిపల్లి, ఆగస్టు 10; (వార్త వేకువ) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధి లోని శ్రీ గోకులం యాదవ సంఘం (బోడుప్పల్ - చెంగిచెర్ల) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కోవడం జరిగింది. యాదవ సమాజ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఐక్యమత్యంతో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు మూడెత్తుల మల్లేష్ యాదవ్ సంఘ ప్రతినిధులు తెలి పారు. నూతన కార్యవర్గ సభ్యులు గా గౌరవ అధ్యక్షులు:బింగి జంగయ్య యాదవ్(మాజీ కార్పొరేటర్), రసాల వెంకటేష్ యాదవ్,(మాజీ కార్పొరేటర్) వ్యవస్థాపక అధ్యక్షుడు: ముదేతుల మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి: సటు నరేష్ యాదవ్, ఉపాధ్యక్షులు: తోకల కిషోర్ యాదవ్,గద్ద తిరుపతి యాదవ్, కోశాధికారి:బోల ముకేష్ యాదవ్,ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ మాట్లా డుతూ... యాదవ సోదరులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సంఘ బలోపేతానికి మరియు సమాజ సేవకు నిరంతరం కృషి చేస్తామని ప్రకటించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ పెద్దలకు, సభ్యులకు ఈ సందర్భంగా వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పత్రికా స్వేచ్ఛని అణిచివేసే ప్రయత్నాలు సహించం

### జర్నలిస్టులను టార్గెట్ చేస్తే ఊరుకునేది లేదు

### మండలంలోని ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు

**భద్రాద్రి జిల్లా ఆగస్టు 10 (వార్త వేకువ) :** అశ్వాపురం, మండలంలోని జర్నలిస్టులంతా ఐక్యంగా నిలబడి పత్రికా స్వేచ్ఛ కోసం పోరాడతాం ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా ప్రజల తరపున ప్రశ్నించే కీలక బాధ్యతను నిర్వహిస్తోందని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ పరిధిలో పత్రికా స్వేచ్ఛ కి రక్షణ ఉందని అశ్వాపురం మండల జర్నలిస్టులు పేర్కొన్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు నిర్వహించే విలేకరుల సమా వేశాల్లో వారు వెల్లడించిన అభిప్రాయాలను ప్రజలకు చేర వేయడం జర్నలిస్టుల వృత్తి బాధ్యతలో భాగమన్నారు.విలేకరుల సమా వేశంలో ఎవరు ఏం మాట్లాడారో వాస్తవాల ఆధారంగా వార్తగా రాయడమే తప్ప, జర్నలిస్టులు స్వతహాగా ఊహించుకుని వార్తలు సృష్టించరని స్పష్టం చేశారు.

### వార్తల్లో వాస్తవ దోషం ఉంటే వివరణ ఇవ్వాలి..

### విలేకరులను ఒత్తిడికి గురి చేయటం సరికాదు...

వార్తలో వాస్తవ దోషం ఉంటే వివరణ ఇవ్వాలి.కానీ వార్త రాసిన జర్నలిస్టుపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని అన్నారు.ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యం, బాధితుల



గోడును వెలుగులోకి తీసుకురావడంలో మీడియా ఎన్నో సందర్భాల్లో కీలక పాత్ర పోషించిందన్నారు.కలం ప్రశ్నించినప్పుడు వ్యవస్థ సమా ధానం చెప్పాలి.. కలాన్ని ప్రశ్నించడం ద్వారా సమస్య పరి ష్కారం కాదని పేర్కొన్నారు.వార్తలపై అభ్యంతరాల పేరుతో జర్న లిస్టులపై ఫిర్యా దులు చేయడం, ఒత్తిళ్లు తీసుకురావడం పత్రికా స్వేచ్ఛాన్ని హరించే చర్యలుగా భావిస్తున్నామని తెలిపారు.వార్త నచ్చకపోతే ఖండన ఇవ్వడానికి, తమ వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి ప్రతి ఒక్కరికీ అవకాశం ఉందన్నారు.

### సమస్య వస్తే ఐక్యంగా పోరాడుతాం

జర్నలిస్టుల గొంతు నొక్కడం కాదు.. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడమే పాలకుల బాధ్యత అని మండలంలోని ఏ జర్నలిస్టు కైనా ఏ సమస్య వచ్చినా ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు.ప్రజా ప్రయోజనాల కోసం నిజాలను వెలుగులోకి తీసుకు రావడంలో జర్నలిస్టులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తారని తెలిపారు.ఒక జర్నలిస్టుపై అనవసర ఒత్తిడి వచ్చినా అశ్వాపురం మండలంలోని జర్నలిస్టులంతా ఐక్యంగా నిలబడి పత్రికా స్వేచ్ఛాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని ప్రక టించారు. జర్నలిస్టును ఆపితే ఒక వార్త ఆగవచ్చు కానీ ప్రజల ప్రశ్నలను ఆపలేరు అని స్పష్టం చేశారు.పత్రికా స్వేచ్ఛ నీ గౌర వించడం అంటే కేవలం జర్నలిస్టుల హక్కును గౌరవించడం కాదని, ప్రజలకు నిజం తెలుసుకునే హక్కును గౌరవించడఎ ేసన్నారు. దకలం ఆగదు.ప్రశ్న ఆగదు.ప్రజల కోసం పత్రికా స్వరం కూడా ఆగదని అశ్వాపురం మండల వ్యాప్తంగా ఏ జర్నలిస్టు కైనా ఇబ్బందులు తలిపితే మండల వ్యాప్తంగా ఉన్న అన్ని క్లబ్ లోని జర్న లిస్టులు ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలం లోని ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు రాజేందర్ వెలమ, మహేష్ ,చలపతి రావు,కల్లూరి నరసింహారావు, ప్రెస్ క్లబ్ సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

## పిర్జాదిగూడలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**పలారం బండి ఊరేగింపులో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**



**మేడిపల్లి, ఆగస్టు 10; (వార్త వేకువ) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పిర్జాదిగూడ ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసిన నిర్వాహకులను, భక్తులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పిర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, వీరాంజనేయ స్వామి దేవాలయ డైరెక్టర్ వంగూరి పరమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, కుర్ర శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# మూత్ర పిండాలు పాడై మంచానికే పరిమితమైన ఉమా మహేశ్వరి.

### వైద్య సేవలు అందుకునే స్తోమత లేక సతమతం.

### పేద యువతి బ్రతుకు భారమై.

### దాతలు స్పందించాలని వేడుకోలు.

**ఖమ్మం ఆగస్టు 10 (వార్త వేకువ):** అసలే కదుదీనా స్థితిలో కొట్టుమిట్టాడుతున్న నిరుపేద కుటుంబం మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబం దీనగాదా భర్తను కోల్పోయి విషాదంలో ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో భర్తను కోల్పోయిన సదరు మహిళ తమ కుటుంబాన్ని కూలి నాలికి వెళ్లి పోషించు కుంటుంది. ఇంతలోనే ఆ కుటుంబానికి ఊహించని సమస్య ఎదుర యింది. ఒక్కసారిగా ఆమె కుమార్తెకు మూత్రపిండాలు పాడే మంచానికి పరిమితం కావటంతో దిక్కు తోచని పరిస్థితి ఎదురైంది. ఖమ్మం మహానగరంలోని యూపీహెచ్ కాలనీలో నివసించే ఆధూరి ప్రమీల భర్త వెంకటేశ్వర్లు చనిపోవడంతో కుటుంబ భారం మొత్తం ఆమెపై పడింది. ఆమె కుమారుడు నాగేంద్ర చారి కార్పెంటర్ పనికి ఆమె కూలి పనులకు వెళ్తూ రోజులు గడుపుతున్నారు. ఈ క్రమంలో



ఆ కుటుంబానికి ఊహించని దెబ్బ తగిలినట్లు కుమార్తె ఉమామహేశ్వరి వయసు 26 కు మూత్రపిండాలు పాడైపోవటంతో తాత్కాలిక వైద్యం అందుకుంటూ ఇంట్లో దిక్కుతోచని స్థితిలో మంచానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఇటీవల హైదరాబాదు లోని నిమ్స్ లో పరీక్షలు చేయించగా సహజ మైనంతా మేరా ఆమెకు శస్త్ర చికిత్స ఆమెకు వెంటనే అందించాలని వైద్యులు సూచనలు చేసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. రోజువారి మందులు కొనేందుకే సతమవుతమవుతున్న కుటుంబ పరిస్థితి అసలే కుటుంబ పరిస్థితి అగమగోచరంగా ఉన్న పరిస్థితుల్లో తమ కుమార్తెకు ఎలా శాస్త్ర చికిత్స చేయించుకోవాలని కృంగిపోతున్నారు. తమ కుమార్తెకు వైద్య సేవలకు ఎవరైనా మనసున్న మహారాజులు దాతలు, స్వచ్ఛంద సంస్థలు లయన్స్ క్లబ్ వ్యవస్థలు వివిధ మానవీయంగా సహాయ సహ కారాలు అందించే సహృదయం కలిగినటువంటి మహోన్నతులు ఎవరైనా తమ కుటుంబం వైపు చూసి ఆదుకోవాలని ఆ కుటుంబం దీన మనసుతో వేడుకుంటుంది. తమ కుమార్తెకు ఆపరేషన్తో పాటు మందులకు సహాయ సహకారాలు సహృదయంతో అందించే దాతలు ఎవరైనా ఉంటే పెద్ద మనసుతో తమకు సహాయ సహకారాలు అందిం చాలని తల్లి ప్రమీల దీనంగా వేడుకుంటుంది. సహృ దయంతో సహాయం చేసే దాతలు 9392133306 కు ఫోన్ నం బరుకు ఫోన్ పే కానీ గూగుల్ పే కానీ లేదా ఫోన్ చేసి ఆదుకోవాలని ఆమె వేడుకుంటుంది.

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ డా. ఎం. రామకృష్ణ



**భద్రాద్రి జిల్లా ఆగస్టు 10 (వార్త వేకువ) :** మణుగూరు మండలంలోని 100 పడకల ఏరియా ఆసుపత్రి సూ పరిం టెండెంట్గా నూతనంగా పదవి బాధ్య తలు చేపట్టిన, సంద ర్భంగా,డా. ఎం. రామకృష్ణ, పిన పాక నియోజకవర్గ శాసన సభ్యు లు పాయం వెంకటేశ్వర్లు,ని మణు గూరు పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఎమ్మెల్యే, ను శాలువలతో సత్కరించి స్వామివారి, ప్రసాదాన్ని అందించి చిత్రపటాన్ని బహూకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డా. ముదిగొండ రామకృష్ణకి శుభాకాంక్షలు తెలియజేసి, పినపాక నియోజక వర్గం లో ప్రజలు అనారోగ్య సమస్యలపై మణుగూరు 100 పడకల ఆసుపత్రికి వస్తుంటారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే హాస్పిటల్ వైద్యులకు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో, పనిచేయాలని ,సూచించారు. ఈ కార్యక్రమంలో డా. బి. విశ్వ నిఖిల్,సి ఏ ఎస్, ఆర్ ఎం ఓ, డా. మోహన్ వంశీ, సి ఎ ఎస్ ఎస్, అనస్థీషియాలజిస్ట్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తంగడపల్లిలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం

**చౌటుప్పల్ సిఐ జి.మన్మధ కుమార్**



**చౌటుప్పల్,ఆగష్టు 10(వార్త వేకువ)** చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామంలో సోమవారం చౌటుప్పల్ సిఐ జి.మన్మధ కుమార్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేకంగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మరియు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు,యువతపై వాటి ప్రభావం, ఆరోగ్యం మరియు భవి ష్యత్తుపై పడే దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.డ్రగ్స్కు దూరంగా ఉండి ఆరోగ్య కరమైన జీవన విధానాన్ని పాటించాలని సూచించారు.డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై కే.యాదగిరి,పోలీసు సిబ్బంది,గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చౌటుప్పల్"అభ్యుదయ యూత్"కమిటీ ఎన్నిక

**అధ్యక్షులుగా చెవగొని వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తోర్పునూరి లింగస్వామి గౌడ్**









**చౌటుప్పల్,ఆగష్టు10 (వార్త వేకువ)** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 13వ వార్డు రామ్ నగర్ కాలనీలో యూత్ కమిటీ సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అభ్యుదయ యూత్ కమిటీ నూతన అధ్యక్షులుగా చెవగొని వెంకటేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శిగా తూర్పునూరు లింగస్వామి గౌడ్,ఉపాధ్యక్షులుగా మార్గం నరసింహ యాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అదేవిధంగా కమిటీ గౌరవ సలహాదారులు చెరుకు అశోక్ గౌడ్,వర్కాల కుమార్ గౌడ్,తోర్పునూరి మహేష్ గౌడ్,గౌరవ అధ్యక్షులు తోర్పునూరి బాబు గౌడ్,బొల్లోజు విశ్వరూప చారి,బాలగోని నరసింహ, తోర్పునూరి నరసింహ,తోర్పునూరి రవి, ఉష్కాగుల శ్రీశైలం,కళ్లెం నాగరాజ్,చెవగొని మహేష్, చెరుకు లింగస్వామి,సందగళ్ళ నాగరాజు, తోర్పునూరి సాయి,నవీన్ చారి,చెరుకు రాము,చెవగొని రమేష్,చెరుకు సాయి,తోర్పునూరి శివప్రసాద్ తదితరులు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

## కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తారోకో

**కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.**



**యాదాద్రి భువనగిరి, ఆగష్టు 10: (వార్త వేకువ) జిల్లా ప్రతినిధి :** ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు మతోన్మాదులకు వ్యతిరేకంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జైలు భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం గుండాల బస్టాండులో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు మద్దెపురం రాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కారు తీసుకు వచ్చిన నూతన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విబిజి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, విద్యుత్ సవరణ బిల్లు మరియు విత్తన సవరణ చట్టాన్ని రద్దు చేయాలని,ఆహార భద్రత చట్ట సవరణను విరమించుకోవాలని,కాంటాక్టు ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలని,కనీస వేతనం ?26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.సుమారు గంటసేపు రాస్తారోకో నిర్వహించగా రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయినవి.సమాచారం అందుకున్న స్థానిక యస్ ఐ వీరబోయిన సైదులు తన సిబ్బందితో కలసి సంబంధిత ప్రదేశానికి చేరుకొని రాస్తారోకో విరమింపజేసి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఇటిక్యాల పరశు రాములు,కల్లుగీత కార్మిక సంఘం మండల కార్యదర్శి బత్తిని బిక్షం,రైతు సంఘం నాయకులు బాలయ్య,ఆవాజ్ నాయకులు ఖలీల్,యస్ యఫ్ ఐ మండల అధ్యక్షుడు దార సతీష్,మహిళ నాయకురాలు సాలమ్మ,గ్రామ పంచాయతీ కార్మికులు అనంతుల ప్రభాకర్,అన్నెపర్తి గిరిబాబు,ఇందిర,పద్మ పాల్గొన్నారు.

## ఘనంగా మునుగోడు పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**మునుగోడు,ఆగష్టు10 (వార్త వేకువ)** మునుగోడు పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలోని మార్కెండేయ ఆలయం ఆవరణంలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు పొట్ట బత్తిని సత్య నారాయణ, జిల్లా పద్మశాలి సంఘం కార్యదర్శి రవీందర్,నల్లగొండ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మిరియాల స్వామి,ఉపాధ్యక్షుడు మిర్యాల వెంకటేశం ముఖ్య అతిథులుగా హాజరై నూతన అధ్యక్షుడిగా చిలువేరు సుదర్శన్,ఉపాధ్యక్షులుగా ఆల్వాల వెంకయ్య,మిర్యాల రమాశంకర్,ప్రధాన కార్యదర్శిగా గంజి నరసింహారావు,సహాయ కార్యదర్శులుగా మిరియాల వీరేశం,మిరియాల కైలాసం,కోశాధికారిగా సింగం గిరిధర్ లతో ప్రమాణ స్వీకారం చేయించారు.అదేవిదంగా డైరెక్టర్లుగా చెరుపల్లి నరసింహ,సింగం వెంకట రమణ, దోర్నాల శ్రీను,కర్నాటి రాజు,చిలువేరు రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు.అనంతరం నూతన అధ్య క్షుడు చిలువేరు సుదర్శన్ మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం అభివృద్ధికి,సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తా మని తెలిపారు.సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ చేనేత రంగం,పద్మశాలి సమాజ అభ్యున్నతికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్య క్షుడు అవ్వారీ భాస్కర్,పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు మిర్యాల మధుకర్,మార్కండేయ దేవా లయం అధ్యక్షుడు కొంగరి కృపానంద్,గౌరవ సలహాదారు సంగిశెట్టి పరమేశం,మారం బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## నారాయణరావుపేట హాస్టల్ను సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాద్రి జిల్లా ఆగస్టు 10 (వార్త వేకువ) :** దుమ్ముగూడెం మండలం , నారాయణరావుపేటలోని హాస్టల్ను భద్రాచలం నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, సోమ వారం, సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారి సమస్యలు, సౌకర్యాలపై ఆరా తీశారు.హాస్టల్లోని కిచెన్, తరగతి గదులు, వసతి గదులను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో పాటు ప్రభుత్వంతో మాట్లాడి తక్షణమే పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
మంగళవారం 11 - 08 - 2026

# పక్కా ప్లాన్ ప్రకారమే టీడీపీ నేత ఇంతియాజ్ హత్య

## మంత్రి టీజీ భరత్ గుప్తా




**కర్నూలు :** కర్నూలులో వైసీపీ రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలతో అరాచకాలు చేస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మండిపడ్డారు. పక్కా పథకం ప్రకారమే టీడీపీ కార్యకర్త ఇంతియాజ్ బాషాను దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. వైసీపీ రాజకీయ హత్యలకు పాల్పడుతోందని అన్నారు. కర్నూలులోని ఆయన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇంతియాజ్ బాషా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారని మంత్రి తెలిపారు. తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని అప్పట్లో వైసీపీ వర్గీయులు ఇంతియాజ్‌ను బెదిరించారని, ఆయన ఇంటికి వెళ్లి గొడవకు దిగారని చెప్పారు. అనంతరం ఇంతియాజ్ టీడీపీలో చేరారని తెలిపారు. ఇంతియాజ్ బాషా హంద్రీ నదిలో వైసీపీ కబ్జాలను, అక్రమాలను బయటపెట్టారని మంత్రి పేర్కొన్నారు. వైసీపీ అక్రమాలను ప్రశ్నించినందుకే ఇంతియాజ్‌ను హత్య చేశారని ఆరోపించారు. గత రెండేళ్లలో కర్నూలులో మూడు హత్యలు జరిగాయని, ప్రతి హత్యలోనూ వైసీపీ ప్రమేయం ఉందని మంత్రి ఆరోపించారు. ఇంతియాజ్‌ను చంపుతామని పరోక్షంగా వారం రోజుల ముందే సోషల్ మీడియాలో పోస్టులు వచ్చినా ఇంటెలిజెన్స్ వర్గాలు ఎందుకు అంచనా వేయలేకపోయాయని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి” అని మంత్రి అన్నారు. గతంలో కావాలనే తన కార్యాలయం ఎదురుగా రెచ్చగొట్టే విధంగా వైసీపీ నేతలు ర్యాలీలు నిర్వహించారని టీజీ భరత్ తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పి, తన కార్యాలయం ఉన్న మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో నిరసనలు చేసుకునేలా చూడాలని కోరినప్పటికీ వైసీపీ నేతల ధోరణిలో మార్పు రాలేదన్నారు. పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కర్నూలులో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి వివరిస్తానని మంత్రి తెలిపారు. “వైసీపీ ధోరణి ఇలాగే ఉంటే చూస్తూ ఊరుకునేది లేదు” అని స్పష్టం చేశారు. 1994 నుంచి 2004 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కర్నూలులో ఫ్యాక్షనిజాన్ని అదుపులోకి తెచ్చామని టీజీ భరత్ గుర్తు చేశారు. అవసరమైతే మళ్లీ కఠిన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలను అంతమొందించినట్లే, ఇప్పుడున్న రౌడీ మూకలను కూడా తుడిచిపెట్టేలా కఠిన చర్యలు తీసుకుంటాం” అని మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియ ప్రారంభం

**కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,434 మందికి హియరింగ్**

**తొలిరోజు 89 మంది నుంచి అభ్యంతరాల స్వీకరణ**

**కర్నూలు :** కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ దశలో మ్యాపింగ్ కాని, సరిపోలని ఓటర్లకు సంబంధించి హియరింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తించి నోటిసులు అందుకున్న ఓటర్ల నుంచి అభ్యంతరాలు, వివరణలు స్వీకరించి, సమర్పించిన ఆధారాలను పరిశీలించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. నగరంలోని ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న నగరపాలక సంస్థ సమావేశ భవనంలో అదనపు ఏఈఆర్వోలు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్, డిప్యూటీ తహాశీల్దార్ ధనుంజయ, అర్బన్ తహాశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో రవికుమార్, డిప్యూటీ తహాశీల్దార్ సరస్వతమ్మ హియరింగ్ నిర్వహించారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్యూమరేషన్ దశలో మ్యాపింగ్ కాని, సరిపోలని ఓటర్లకు సంబం ధించి మొత్తం 2,434 మందికి హియరింగ్ నిర్వహించాల్సి ఉంది. ఇందులో భాగంగా సోమవారం తొలిరోజు 89 మంది హాజరై తమకు సంబంధించిన అభ్యంతరాలు, వివరణలను అధికారులకు సమర్పిం చారు. అధికారులు సంబంధిత పత్రాలు, ఆధారాలను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో మ్యాపింగ్‌లో తలెత్తిన వ్యత్యాసాలు, వివరాల్లో సరిపోలకపోవడం వంటి అంశాలను సంబంధిత ఓటర్ల నుంచి వివరణలు, ఆధారాలు స్వీకరించి పరిష్కరించేందుకు హియరింగ్ నిర్వహిస్తున్నారు. ఈ హియరింగ్ ప్రక్రియను ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగించనున్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సంబంధిత ఓటర్లకు హియరింగ్ నిర్వహించి, వారి నుంచి అవసరమైన పత్రాలు, ఆధారాలను స్వీకరించి పరిశీలన అనంతరం తదుపరి చర్యలు



చేపట్టనున్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలకు సంబంధించి నోటీసు అందిన వారు నిర్ణీత తేదీలో హియరింగ్‌కు హాజరై అవసరమైన పత్రాలతో తమ అభ్యంతరాలు, వివరణలను సమర్పించాలని అధికారులు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# విబిజి రామ్ జి పనుల్లో పురోగతి సాధించాలి

**సంకెన్ పిట్లు, చెక్‌డ్యామ్‌లు, క్యాస్కేడ్ ట్యాంకుల పనులకు ప్రాధాన్యం**

**ఆగస్టు 14న ప్రతి గ్రామ పంచాయతీలో భారీగా మొక్కలు నాటాలి**

**పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు**

**జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

**కర్నూలు :** జిల్లాలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచే లక్ష్యంతో చేపట్టిన జలధార--జలహారతి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. గతంలో చేపట్టిన పనుల ద్వారా సుమారు 0.49 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఏర్పడిందని, ప్రస్తుతం వర్షాలు కురిసే సమయంలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పి.జి.ఆర్.ఎస్., రెవెన్యూ, వి.బి.జి. రామ్‌జీ, విద్య తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారం, పెండింగ్ అంశాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్షించి, సమస్యలను సత్వరంగా పరిష్కరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...గ్రామసభల ద్వారా వర్షపు నీటి ప్రవాహ మార్గాలు, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, సహజ ప్రవాహాన్ని వినియోగించుకునేలా క్యాస్కేడ్ ట్యాంకులు, చెక్‌డ్యామ్‌లు, ఫీడర్ ఛానళ్లు, ఫామ్ పాండ్లు, రిటెన్షన్ పిట్లు, సంకెన్ పిట్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సంకెన్ పిట్లను నిర్దేశిత కొలతలతో నిర్మించి, వాటి సంఖ్య, పరిమాణం, ప్రదేశం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రతిపాదించిన పనులు, కొత్త పనులు రెండుసార్లు నమోదు కాకుండా



అధికారులు పరిశీలించాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో లేబర్ హాజరు తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే రెండు రోజుల్లో హాజరును మరింత పెంచి లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. పనితీరు సరిగా లేని ాూాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వరుసగా మూడు నోటీసుల అనంతరం కూడా మార్పు లేకపోతే శాఖాపరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ాూాలు, వీణాలు క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలను పనులకు సమీకరించాలని సూచించారు. ఆగస్టు 14న ప్రతి గ్రామ పంచాయతీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆగస్టు 12, 13 తేదీల్లో అటవీ, డ్వామా నర్సరీల నుంచి 2--3 అడుగుల ఎత్తు ఉన్న మొక్కలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో నిర్దేశించిన 5,000 ఎకరాల లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు పంటల బీమా, ్రావీణా వంటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో గుర్తించిన పనులను త్వరగా పూర్తి చేసి, వాటి పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని అధికారులకు సూచించారు.

**పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు**

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, అర్జీలను చివరి నిమిషంలో కాకుండా ముందుగానే పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత వరకు కృషి చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే, భూ రికార్డులకు సంబంధించిన ఆన్‌లైన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సాంకేతిక కారణాలతో అర్జీదారులకు ఇబ్బందులు కలిగించరాదని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంహెచ్‌ఓలు, తహసీల్దార్లు ప్రతిరోజూ డీఆర్‌ఓను కలిసి సమీక్షించుకోవాలని సూచించారు. మండల సర్వేయర్లు భూ సర్వేకు వెళ్లే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు నోటీసులు జారీ చేసి, సర్వే అనంతరం పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నోటీసులు జారీ చేయకుండా సర్వేలకు వెళ్లడం, నిబంధనలు పాటించకపోవడం తన దృష్టికి వచ్చిందని, ఇకపై పద్ధతి మార్చుకోకపోతే సంబంధిత సర్వేయర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, పీజీఆర్ఎస్ అంశాలపై ఉన్నతస్థాయి అధికారులు నిరంతరం సమీక్షిస్తున్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను సంబంధిత మండల అధికారులు స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా సమంజసమైన నివేదికలను సిద్ధం చేసి నిర్ణీత సమయంలో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి లోపాలు లేకుండా, ప్రజలకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారెడ్డి, నైపుణ్యాభివృద్ధి అధికారి దీప్తి, వీడియో కాన్ఫరెన్స్ తహాశీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత మండల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు

**అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలి**

**పీజీఆర్ఎస్‌లో ‘రీ-ఓపెన్’, ‘ఇంప్రాపర్ రెడ్రెసల్’ కేసులు పూర్తిగా తగ్గాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**


**కర్నూలు :** ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అర్జీని అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుపై అధికారులు సత్వరంగా స్పందించి, పరిష్కరించాలని, అర్జీదారులకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, పూర్తి వివరాలతో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీపై తీసుకున్న చర్యలు, పరిష్కరించిన విధానం తదితర అంశాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని సమస్యల విషయంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశిం చారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న ‘రీ-ఓపెన్’, ‘ఇంప్రాపర్ రెడ్రెసల్’ కేసులను పూర్తిగా తగ్గించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకసారి పరిష్కరించిన అర్జీ మళ్లీ రీ-ఓపెన్ అయ్యే పరిస్థితి రాకుండా, సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. నిబంధనల పరిధిలో సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని



సూచించారు. అర్జీలను గడువు లోపు పరిష్కరి ంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివ ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ తైక్వాండో పోటీలలో రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ

**కర్నూలు :** లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ సౌత్ జోన్ తైక్వాండో పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, కర్నూలు జిల్లాకు విశేష కీర్తి తీసుకొచ్చారు. ఆగస్టు 4 నుండి 8 వరకు హైదరాబాద్‌లోని ఆరిజిన్ స్కూల్ వేదికగా నిర్వహించిన సీబీఎస్ఈ సౌత్ జోన్ తైక్వాండో పోటీలలో రిడ్జ్ పాఠశాలకు చెందిన డి. శివ విఘ్నేష్ రెడ్డి (సిల్వర్ మెడల్), షెర్లిన్ సంజీవ్ (బ్రాంజ్ మెడల్) సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. వీరి విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో సీఈఓ జి. గోపీనాథ్ మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఈ విజయం ఎంతో ప్రశంసనీయమని అన్నారు. క్రమశిక్షణ, కఠోర శ్రమ, పట్టుదలతో సాధన చేయడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ విజయం రిడ్జ్ పాఠశాలకే కాకుండా కర్నూలు జిల్లాకు కూడా మంచి గుర్తింపు తీసుకొచ్చిందని తెలిపారు. కో-సీఈఓ సౌమ్య గోపీనాథ్ మాట్లాడుతూ, తైక్వాండో వంటి క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ఈ స్థాయికి తీర్చిదిద్దిన తైక్వాండో మాస్టర్ జి. సుందర్ రాజు ని పాఠశాల యాజమాన్యం వారు ప్రత్యేకంగా అభినందించారు ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీన్ పి.కె. రాజేంద్రన్ , ప్రిన్సిపల్ ఏ. రాజ్‌కమల్ , హెచ్‌ఓడీలు ఏ. నాగేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొని విజేత



విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్ఠాత్మక విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

**విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి: వైఎస్సార్‌సీపీ**






**కర్నూలు :** డీఎస్సీ లీకేజీ, నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వారు స్పష్టం చేశారు. డీఎస్సీ అక్రమాలు, నిరుద్యోగుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి ఎస్.వి. విజయ మనోహరి గారు పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డీఎస్సీ ప్రక్రియపై అభ్యర్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుట్ట రేణుక , మాజీ మేయర్ బి.వి. రామయ్య , కటిక గౌతమ్, బాలు, అన్సార్ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల భారీ భాగస్వామ్యంతో ర్యాలీ విజయవంతమైంది.

# ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండ

**మంత్రి టీజీ భరత్ , రూ.20 లక్షల ఆర్థిక సాయం**



**కర్నూలు :** రాజమండ్రిలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి టీజీ భరత్ పరామర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్పూర్ గ్రామానికి వెళ్లిన మంత్రి,ప్రియాంక మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రియాంక తండ్రి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 20 లక్షల ఆర్థిక సాయం చెక్కును ప్రియాంక తండ్రికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ప్రియాంక మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుని, వారికి కఠిన శిక్షలు పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రియాంక చికిత్స పొందిన సమయంలో ఆసుపత్రిలో అయిన వైద్య ఖర్చులతో పాటు, ఆమె మెడికల్ పీజీ సీటుకు సంబంధించిన ఫీజు ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కష్ట సమయంలో ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రియాంక కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని, కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని విధాలా తోడుగా ఉంటామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**కాంట్రాక్టు ఉద్యోగుల వినతి.. ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం**



**జీవన ధార ఆదోని :** వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆదోని డివిజన్‌కు చెందిన వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హామీ ఇచ్చినట్లు కాంట్రాక్టు ఉద్యోగులు తెలిపారు.

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ఇంటింటికీ ప్రచారం



**గోనెగండ్ల :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, గౌరవ ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి గారి సూచనలతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు, చిన్ననెలటూరు గ్రామాల్లో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా.. అభివృద్ధే ధ్యేయంగా.. కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ప్రతి కుటుంబానికి చేరవేసేలా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కౌలు ఇచ్చి గంజాయి సాగు ఆపై ఒడిశా టు హైదరాబాద్ వయా ఖమ్మం సప్లై

**కౌలు ఇచ్చి గంజాయి సాగు చేయిస్తున్న స్మగ్లర్లు - పేదలు, రోగుల కుటుంబసభ్యులకు ఆశ చూపి ఖమ్మం జిల్లా మీదుగా అక్రమ రవాణా - డ్రగ్స్ అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టిన ఆబ్కారీశాఖ**



ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా హైదరాబాద్ నగరంతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యమైన నగరాలు, పట్టణాలకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నారు. ఈ దందాకు ముఖద్వారంలా ఉన్న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా పెట్టినట్లుగా ఆబ్కారీ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు.

### ఒడిశాలో కౌలుకు గంజాయి సాగు :

ముంబయి, కొచ్చి, బెంగళూరు తదితర నగరాలకు చెందిన స్మగ్లర్లు ఒడిశాలో కౌలు ఇచ్చి గంజాయి సాగు చేయిస్తున్నారని ఆబ్కారీ శాఖ డీసీ సోమిరెడ్డి వివరించారు. పేద కుటుంబాలు, రోగుల కుటుంబ సభ్యులకు ఆశ చూపి ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా అక్రమంగా రవాణా చేయిస్తున్నారని తెలిపారు. మన దగ్గర వినియోగం కంటే రవాణా ఎక్కువ. ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల పరిసరాల్లోని పాన్, టీ షాప్‌లు, కెఫేలలో గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దారు వద్ద బైండోవర్ చేస్తున్నామని వెల్లడించారు. ఆగస్టు 15వ తేదీలోగా బైండోవర్ల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

### ఒక్క నెలలోనే 213 కిలోలు :

జనవరి నెల నుంచి జూన్ వరకు 6 నెలల్లో 109 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్న సోమిరెడ్డి, 150 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. గత జులై ఒక్క నెలలోనే 840 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. తనిఖీలు నిర్వహించి 213 కిలోల గంజాయిని పట్టుకున్నామని చెప్పారు. ఆబ్కారీ పోలీసు విధుల్లోనూ పలు మార్పులు చేశామన్న ఆయన, రెండ్రోజులకోసారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు.

### జాతీయ రహదారులపై మద్యం కట్టడి :

నేషనల్ హైవేల వెంట గొలుసు కట్టు దుకాణాల్లో అధిక ధరలకు పలు రకాల బ్రాండ్ల మద్యం అమ్ముతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని సోమిరెడ్డి తెలిపారు. ప్రమాదాల నివారణకు హైవేల వెంట ఉన్న దాబాలు, పాన్ షాపులు, అనుమానాస్పద కిరాణా షాప్‌ల నిర్వాహకులను బైండోవర్ చేస్తున్నామని వివరించారు. దీంతో 60 శాతం మేర గొలుసు దుకాణాలు మూతపడ్డాయని వివరించారు.

### ఉమ్మడి రాష్ట్రాల ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో :

భద్రాచలం, మణుగూరు, పాల్వంచ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోనే ఆంధ్రప్రదేశ్‌లో తయారైన నాటు సారాయి విక్రయిస్తున్నట్లు గుర్తించామని సోమిరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి విశాఖ డీసీ శ్రీరామచంద్రమూర్తితో మాట్లాడామని వివరించారు. త్వరలో ఉమ్మడి రాష్ట్రాల ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 13 ఆబ్కారీ స్టేషన్లలో మూడింటికే సొంత భవనాలు ఉన్నాయని వెల్లడించారు. కొన్నిచోట్ల పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయన్నారు. వీటితో పాటు జిల్లా స్థాయి అధికారుల కార్యాలయాల భవన నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు రాగానే నిర్మాణాలు చేపడతామని సోమరెడ్డి స్పష్టం చేశారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు నేడే లాస్ట్ డేట్ - మిస్సైతే మీ ఓటు గల్లంతే

**హైదరాబాద్ క్యూర్ పరిధిలో 40 శాతం ఓట్లు తొలగే అవకాశం**
**సర్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 శాతం ఓట్లు గల్లంతు!**
**అక్టోబరు 19న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్న ఈసీ**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కీలక దశ నేటితో ముగియనుంది. ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్) తిరిగి ఇచ్చేందుకు నేడే చివరి రోజు కాగా, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 శాతానికి పైగా ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా నమోదు కాలేదు. అర్హులైన ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను ఇంకా ఇవ్వకపోతే వెంటనే బీఎల్వోలకు సమర్పించాలని ఎన్నికల సంఘం సూచించింది.

### ఈ నెల 17న ఓటర్ల ముసాయిదా :

రాష్ట్రంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ కొలిక్కి వస్తోంది. ఎస్ఐఆర్‌లో కీలకమైన ఎన్యూమరేషన్ ప్రక్రియ నేటితో ముగియనుంది. ఓటర్లు వివరాలు నింపి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను ఎన్నికల కమిషన్ డిజిటలైజేషన్ చేస్తోంది. ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చిన ఓటర్ల పేర్లు మాత్రమే ఈ నెల 17న ప్రకటించనున్న ముసాయిదా జాబితాలో ఉంటాయని ఇప్పటికే ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 శాతానికి పైగా ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా ఈసీకి అందలేదు.

### క్యూర్ పరిధిలో సుమారు 40 శాతం :

ప్రస్తుత జాబితా ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. జూన్ 25 నుంచి దాదాపు పది రోజుల్లోనే ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. అయితే 2,64,30,494 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే డిజిటలైజ్ అయినట్లు వెల్లడించింది. ఆ లెక్కన దాదాపు 73 లక్షలకు పైగా ఓట్లు గల్లంతైనట్లేనని తెలుస్తోంది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో సుమారు 40 శాతం ఓట్లు తగ్గిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఆదివారం సాయంత్రం వరకు హైదరాబాద్ జిల్లాలో 58.58 శాతం, మేడ్చల్‌లో 63.82, రంగారెడ్డిలో 64.81 శాతం ఓటర్లు మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగిచ్చారు.

### 43 లక్షలకు పైగా ఓట్లు :


హైదరాబాద్‌లో 19 లక్షలకు పైగా, రంగారెడ్డి జిల్లాలో 12 లక్షలకు పైగా, మేడ్చల్ జిల్లాలో 10 లక్షలకు పైగా ఓట్లు తొలగిపోనున్నట్లు తెలుస్తోంది. మొత్తం హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ఆ మూడు జిల్లాల్లోనే సుమారు దాదాపుగా 43 లక్షలకు పైగా ఓట్లను తొలగించే అవకాశం ఉంది. గత నెల 23 నాటికి 70 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తైంది. గత 17 రోజులుగా దాదాపు 8 శాతం మాత్రమే పెరిగింది. చివరి రోజు పెద్దగా మార్పు ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. నేటితో ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగియనున్నందున అర్హులైన ఓటర్లు ఈఎఫ్‌లు ఇంకా ఇవ్వకపోతే వెంటనే బీఎల్వోల ద్వారా లేదా ఆన్‌లైన్‌లో సమర్పించాలని ఎన్నికల సంఘం సూచనలు చేసింది.

### అక్టోబరు 19న ఓటర్ల తుది జాబితా :

సర్ ద్వారా తెలంగాణలో సుమారు 20 శాతం ఓట్లు తగ్గిపోయే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వారిలో మరణించిన వారు, అడ్రస్ లేని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారితో పాటు నకిలీ ఓట్లు సుమారు 60 లక్షల వరకు గుర్తించారు. ఈ నెల 17న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించనున్నారు. అదే రోజు నుంచి సెప్టెంబరు 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. ఎన్యూమరేషన్ ఫారాల్లో 2002-సర్‌కు చెందిన వివరాలు లేకుంటే సదరు ఓటర్లకు నోటీసులు ఇస్తారు. నోటీసులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ ఈ నెల 17 నుంచి అక్టోబరు 15 వరకు చేపట్టనున్నారు.

# కీలక దశకు విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులు డీపీఆర్‌లపై కేంద్రం ఆర్థిక మదింపు

**రెండు ప్రాజెక్టుల డీపీఆర్‌లనును ఆర్థిక మదింపునకు పంపిన కేంద్రం - తొలిదశలో రూ.21,616 కోట్ల భారీ పెట్టుబడితో మెట్రో నెట్‌వర్క్ - మెట్రో కారిడార్ల వెంట కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడే అవకాశం**




విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులు కీలక దశకు చేరుకున్నాయి. రెండు ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లను కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మదింపునకు సంబంధిత డివిజన్‌కు పంపింది. రెండు నగరాల్లో కలిపి తొలిదశలో రూ.21,616 కోట్ల భారీ పెట్టుబడితో 84.63 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ నుంచి నగరంలోని కీలక ప్రాంతాలకు మెట్రో అనుసంధానంతో ఉద్యోగులు, ప్రజల రాకపోకలు సులభతరం కానున్నాయి. విజయవాడలో గన్నవరం నుంచి కారిడార్ ఏర్పాటుతో విమానాశ్రయం, నగరం ప్రధాన నివాస, వాణిజ్య ప్రాంతాల మధ్య ప్రజా రవాణా అనుసంధానం బలోపేతం కానుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రెండు ప్రాజెక్టుల డీపీఆర్‌లను కేంద్రానికి పంపారు. వీటిపై కొన్ని అభ్యంతరాలు, సూచనల తర్వాత ఆర్థిక మదింపునకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సంయుక్త భాగస్వామ్య విధానం (జేవీ మోడల్)లో ఈ రెండు ప్రాజెక్టులూ చేపట్టనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 20%, కేంద్ర ప్రభుత్వం 20% చొప్పున నిధులు సమకూర్చనున్నాయి. మిగిలిన 60% నిధులు ఆర్థిక సంస్థల నుంచి సేకరించనున్నారు. కొన్ని విదేశీ బ్యాంకులు రుణం సమకూర్చేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

### 40 శాతం వరకు టెండరింగ్ ప్రక్రియ :

విశాఖ ఇప్పటికే పారిశ్రామిక, ఐటీ, పర్యాటక కేంద్రంగా ఎదుగుతోంది. విజయవాడ వాణిజ్య, రవాణా, పరిపాలనా కేంద్రంగా కీలకంగా ఉంది. ఈ రెండు నగరాల్లో మెట్రో రైళ్లు అందుబాటులోకి వస్తే రోడ్డు రవాణాపై ఒత్తిడి తగ్గడంతో పాటు నగర ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోనున్నాయి. నగర అభివృద్ధి ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా మెట్రో కారిడార్ల వెంట కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడే అవకాశం ఉంది. మెట్రో రైల్ ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం వరకు టెండరింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు ప్రభుత్వం మెట్రో రైల్ కార్పొరేషన్‌కు ఇప్పటికే సూత్రప్రాయంగా అనుమతులిచ్చింది.

### మెట్రో రైల్ ప్రాజెక్టుకు 80 ఎకరాలు :

డీపీఆర్‌లపై ఆర్థిక మదింపు ప్రక్రియ పూర్తయి కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెలువడితే తొలి దశ పనులకు పునాది పడనుంది. విజయవాడలో మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎస్ఐఏ) సర్వే ప్రారంభమైంది. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, గన్నవరం, పెనమలూరులో ఈ ప్రక్రియ చేపడుతున్నారు. రెండు కారిడార్ల మెట్రో రైల్ ప్రాజెక్టుకు దాదాపు 80 ఎకరాలు అవసరం. ఇందులో కోచ్ డిపో, మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ అధికారుల బృందాలు సంయుక్తంగా సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నాయి. ఇది పూర్తయ్యాక భూసేకరణకు జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ ఇవ్వనుంది.

### విశాఖపట్నం, విజయవాడ మెట్రో

### రైల్ ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలు :

### 1. విశాఖపట్నం

తొలి దశ పొడవు: 46.23 కి.మీ. కారిడార్లు: స్టీల్‌ప్లాంట్-కొమ్మాది, గురుద్వార-పాత పోస్టాఫీస్, తాటిచెట్లపాలెం-చినవాల్తేరు అంచనా వ్యయం: రూ.11,498 కోట్లు 2. విజయవాడ తొలి దశ పొడవు: 38.40 కి.మీ. కారిడార్లు: పండిట్ నెహ్రూ బస్టాండ్-గన్నవరం, పండిట్ నెహ్రూ బస్టాండ్-పెనమలూరు అంచనా వ్యయం: రూ.10,118 కోట్లు

## వీధులే కాన్వాస్‌లు అద్భుత చిత్రాలతో

# అలరించిన అమరావతి కళా వీధి

**గుంటూరులో వినూత్నంగా అమరావతి చిత్రకళా వీధి - రంగుల చర్మపు బొమ్మలు, గృహోపకరణాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన నగరవాసులు**




గుంటూరులో వినూత్నంగా నిర్వహించిన అమరావతి చిత్రకళా వీధి రెండో రోజుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సందర్శకులకు మరిచిపోలేని చిత్ర జ్ఞాపకాల్ని అందించింది. దేశంలోని దాదాపు 800 మందికి పైగా కళాకారులు వీధుల్నే కాన్వాస్‌గా మలుచుకుని చిత్రించిన అద్భుతమైన చిత్రాలకు కళాభిమానులు మంత్రముగ్ధులయ్యారు. సాంస్కృతిక, సంగీత కార్యక్రమాల నడుమ ఉల్లాసంగా గడిపారు.

### ప్రతిదీ ఓ కళాఖండమే :

కాదేదీ కళకు అనర్హం అన్నట్లు అమరావతి చిత్రకళా వీధిలో ప్రతిదీ ఓ కళాఖండమే. దాదాపు 700 స్టాల్స్ ఏర్పాటు చేయగా వేలాది కళా రూపాలు అమరావతి కళా వీధిలో దర్శనమిచ్చాయి. చిత్రకారులు తమ నైపుణ్యాలతో మహనీయుల చిత్రాలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. వ్యర్థాలకు ఉక్కు శిల్పాలతో సరికొత్త అర్థం చెప్పారు. ఒక వైపు దేవుళ్ల చిత్రాలు, మరోవైపు దేశం కోసం ప్రాణాలిచ్చిన దేశభక్తుల అద్భుత బొమ్మలు, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చిత్రాలు ఇలా ఎందరో ప్రముఖుల చిత్రాలకు రూపమిచ్చారు కళాకారులు. కొబ్బరి చిప్పలతో చేసిన సృజనాత్మక వస్తువుల్ని చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన తోలుబొమ్మల చిత్రాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగుల చర్మపు బొమ్మలు, గృహోపకరణాల పట్ల నగరవాసులు ప్రత్యేక శ్రద్ధ చూపారు.

### పోటెత్తిన సందర్శకులు :

రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల ఉత్సవంలో చివరి రోజున ఆదివారం కావడంతో సందర్శకులు పోటెత్తారు. లైవ్ ఆర్ట్ చిత్రకళను కళాభిమానులు ఆసక్తిగా తిలకించారు. అమరావతి శిల్పకళ, కలంకారీ, కొండపల్లి బొమ్మలు, శ్రీకాళహస్తి చిత్రాలు, లేపాక్షి సాంప్రదాయాలతో పాటు పల్లెటూరి జీవన విధానాన్ని ప్రతిబింబించే చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సందర్శకులు సెల్ఫీలు, స్వీయచిత్రాలు దిగడానికి వీలుగా 10కి పైగా ఆకర్షణీయమైన ఫొటో జోన్లను ఏర్పాటు చేయగా కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా ఫొటోలు దిగారు. ఓపెన్-ఎయిర్ ఆర్ట్ గ్యాలరీని తలపించిన ఈ ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన రిజిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత పెయింటింగ్ కిట్లు అందించడానికి ఉపయోగించనున్నారు.

# హుస్సేన్ సాగర్‌లో టేకాఫ్.. ప్రకాశం బ్యారేజీలో ల్యాండింగ్.. రెండు రాష్ట్రాల సీ ప్లేన్ సర్వీసులు

**హైదరాబాద్-విజయవాడ మధ్య సీ-ప్లేన్ సర్వీసులు**
**తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనపై కేంద్రం సానుకూలత**
**హుస్సేన్‌సాగర్‌లో ఏఏఐ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన**
**ఒకేసారి 9 నుంచి 12 మంది ప్రయాణించే వీలు**
**రెండు రాష్ట్రాల మధ్య పర్యాటకానికి కొత్త ఊపు**



తెలుగు రాష్ట్రాల మధ్య సరికొత్త పర్యాటక శకానికి శ్రీకారం చుట్టే సీ-ప్లేన్ ప్రాజెక్టు ఊహల నుంచి ఆచరణ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ, కేంద్రం సానుకూలతతో ఈ ప్రతిష్ఠాత్మక పథకం పట్టాలెక్కుతోంది. ఈ క్రమం లోనే, హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో 'వాటర్ ఏరోడ్రోమ్' ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేశారు. హుస్సేన్‌సాగర్ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు విమానంలో ప్రయాణించే అద్భుత అనుభూతిని ప్రజలకు అందించడమే లక్ష్యంగా కసరత్తు ముమ్మరమైంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమై ఈ ప్రతిపాదనను చర్చించారు. హుస్సేన్‌సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీ-ప్లేన్ సేవలు ప్రారంభిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్ ఏర్పడుతుందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ చర్చల అనంతరం ప్రాజెక్టులో వేగం పుంజుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలకు అనుగుణంగా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఉన్నతాధికారుల బృందం నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. సీ-ప్లేన్‌లు సురక్షితంగా టేకాఫ్, ల్యాండింగ్ అవ్వడానికి అవసరమైన వాటర్ ఏరోడ్రోమ్ పాయింట్లు, నీటి లోతు, ప్రయాణికుల రాకపోకలకు అనువైన ప్రాంతాలపై ప్రాథమిక అంచనాకు వచ్చారు. త్వరలోనే ఈ బృందం విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కూడా ఇదే తరహా సర్వే నిర్వహించనుంది. సీ-ప్లేన్‌ల కోసం ప్రత్యేకంగా రన్‌వే అవసరం లేదు. నీటిపైనే దిగి, అక్కడి నుంచే గాల్లోకి ఎగురుతాయి. వీటి కోసం 'వాటర్ ఏరోడ్రోమ్'లను నిర్మిస్తారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఒక్కో సీ-ప్లేన్‌లో 9 నుంచి 12 మంది ప్రయాణించవచ్చు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో ట్రయల్ రన్స్ జరిగినా, ఈసారి పూర్తిస్థాయి సర్వీసులు ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ఉన్నాయి. ఏఏఐ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తదుపరి చర్యలు తీసుకోనున్నాయి.

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..

# ఏపీ యువ ఇంజనీర్ దుర్మరణం

**ఉద్యోగంలో చేరిన ఐదు నెలలకే ఈ దుర్ఘటన**
**మృతుడు తిరుపతి జిల్లా చిట్వేల్ మండలానికి చెందిన దిలీప్ కుమార్**
**మృతదేహం తరలింపునకు ఐదు రోజులు పట్టే అవకాశం**



అమెరికాలో ఉన్నత విద్యనభ్యసించి, ఉద్యోగంలో స్థిరపడి కుటుంబానికి ఆసరాగా నిలుస్తాడనుకున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆ కుటుంబంలో పెను విషాదాన్ని నింపి ంది. తిరుపతి జిల్లా చిట్వేల్ మండలం జట్టివారిపల్లె గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ (26) అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఉన్నత చదువుల కోసం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లిన దిలీప్, కెంట్ స్టేట్ యూనివర్సిటీలో చదువు పూర్తి చేసి ఐదు నెలల క్రితమే ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. తన స్నేహితుడిని విమానాశ్రయంలో దించి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఒహాయో రాష్ట్రంలోని మాసిడోనియా ప్రాంతంలో దిలీప్ ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వేగంగా వచ్చిన ఓ పికప్ ట్రక్కు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దిలీప్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. దిలీప్ మరణవార్త తెలియగానే జట్టివారిపల్లెలోని ఆయన తల్లిదండ్రులు బంగటవుల శ్రీహరి, చాముండి కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రస్తుతం అమెరికాలో వారాంతపు సెలవులు కావడంతో, దిలీప్ భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకురావడానికి మరో ఐదు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం. ఈ విషాద ఘటనపై న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ స్పందించింది. మృతుడి కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని, భౌతికకాయాన్ని భారత్‌కు తరలించేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు వెల్లడించారు.

# గుమ్మడికాయ చేసే మేలెంతో తెలుసా

**గుమ్మడికాయలో పోషకాలు అనేకం**

**ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్ని లాభాలు ఉన్నాయంటున్న నిపుణులు**



గుమ్మడికాయ అనగానే హల్వా, పప్పు, సాంబార్, వడియాలు, సూప్ చేసుకోవడానికో ఉపయోగిస్తాం. కానీ, దీనివల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇందులో మినరల్స్, విటమిన్స్, ఫైబర్ అధికంగా ఉంటాయని చెబుతున్నారు. ఈ క్రమంలో గుమ్మడికాయ వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం!

**కంటి ఆరోగ్యం :** క్యారెట్లు, ఆకుకూరలు, చిలగడదుంపల్లో మాదిరిగానే గుమ్మడికాయలోనూ బీటా కెరొటిన్ పుష్కలంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే ఇది శరీరంలోకి చేరుకున్న తర్వాత విటమిన్ ఏ రూపంలోకి మారిపోతుందని అధ్యయనం పేర్కొంది. విటమిన్ దృష్టిని కాపాడటానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి , ఆరోగ్యకరమైన చర్మం, ఎముకలను నిర్వహించడానికి, కణాల పెరుగుదల, విభజనను నియంత్రించడానికి సహాయపడుతుందని తెలిపింది. ఇది గుండె జబ్బులు, కొన్ని క్యాన్సర్ల నుంచి కూడా రక్షణ కల్పిస్తుందని చెబుతుంది. అరకప్పు గుమ్మడి ముక్కలతోనే మనకు రోజుకు అవసరమైన విటమిన్ ఏ లభిస్తుందని సూచిస్తున్నారు.

**క్యాన్సర్ నివారణ :** గుమ్మడికాయ గింజల్లో డయాబెటిస్ నిరోధక, క్యాన్సర్ నిరోధక లక్షణాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుమ్మడికాయ గింజలలో లభించే జింక్, ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, సెలీనియం మూలకాలు వాటిని పోషక శక్తి కేంద్రంగా, ఆర్థరైటిస్, వాపు, ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు నివారణగా పనిచేస్తుందని అధ్యయనం పేర్కొంది.

**హైబీపీ అదుపులో :** గుమ్మడికాయలోని పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటుని అదుపులోకి తీసుకొస్తుందంటున్నారు నిపుణులు. తద్వారా పక్షవాతం, గుండె సమస్యలు తగ్గుముఖం పడతాయని చెబుతున్నారు. అంతేకాదు, ఎముక సాంద్రత కూడా మెరుగవుతుందట. గుమ్మడికాయ గింజలలో లభించే అధిక మెగ్నీషియం, జింక్, అమైనో ఆమ్లాల వల్ల అధిక రక్తపోటు, గుండె జబ్బులు, అధిక రక్త చక్కెర ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఎశ్రీవజవశ్రీఖఅఎఎశ్రీఱఅఱఎ అధ్యయనం పేర్కొంది.

**బరువు నియంత్రణ :** గుమ్మడిలో ఫైబర్ అధికంగా, కేలరీలు తక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో తయారు చేసిన ఆహార పదార్థాలను కొద్దిగా తీసుకున్నా వెంటనే కడుపు నిండిన భావన కలుగుతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా, బరువు నియంత్రణలో ఉంటుందని, డైట్‌లో ఉన్నవారూ దీన్ని తినొచ్చని సూచిస్తున్నారు. అలాగే, మలబద్ధకం కూడా దూరమవుతుందని తెలియజేస్తున్నారు.

**మంచి నిద్ర :** గుమ్మడి గింజల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో అమ్లం ఉంటుందట. ఇది శరీరంలో సెరోటోనిన్, మెలటోనిన్ వంటి నిద్ర హార్మోన్లను ఉత్పత్తి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పడుకునే ముందు కొన్ని గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల నిద్ర నాణ్యత పెరుగుతుందని సూచిస్తున్నారు.

**రోగనిరోధక శక్తి బలోపేతం :** రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు గుమ్మడిలో పుష్కలంగా ఉంటాయి. ఈ క్రమంలో బీటా కెరొటిన్‌తో పాటు విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, ఫోలేట్ కూడా గుమ్మడిలో ఎక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. ఫలితంగా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జలుబు, ఫ్లూపై పోరాడే శక్తి శరీరానికి లభిస్తుందని చెబుతున్నారు.

**అందానికీ మంచివట! :** గుమ్మడిలో ఉండే విటమిన్ సి కొలాజెన్‌ను ఉత్పత్తి చేసేందుకు తోడ్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది సూర్యుడి యూవీ కిరణాల నుంచి కాపాడుతుందని తెలియజేస్తున్నారు.గుమ్మడికాయ తినడం ఆరోగ్యానికి మంచిదే, కానీ అలర్జీ ఉన్నవారు తీసుకోకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. అతిగా తీసుకున్నా శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుందని హెచ్చరిస్తున్నారు. క్యాండీలు, కేక్, ఫిల్లింగ్స్‌లోనూ గుమ్మడికాయని వాడతారని, అవి ఆరోగ్యానికి అంత మంచిది కాదని సూచిస్తున్నారు.

# విస్తరిస్తున్న కడుపు క్యాన్సర్ లక్షణాలు వెల్లడించిన నిపుణులు



ఎసిడిటీ, గ్యాస్ బాధల్ని మనం చాలాసార్లు పెద్దగా పట్టించుకోము. ఏదో ఒక యాంటాసిడ్ మాత్ర వేసుకుంటాము. అయితే, ఇవే బాధలు దీర్ఘకాలికంగా కొనసాగుతుండటం, వీటికి తోడు తరచూ పొట్టలో నొప్పి, బరువు తగ్గడం, మలంలో రక్తం వంటి లక్షణాలు కనిపిస్తుంటే నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు నిపుణులు. ఇలాంటి లక్షణాల వెనుక ఒక్కోసారి ప్రమాదకర క్యాన్సర్లు దాగి ఉండే ప్రమాదం ఉందని హెచ్చస్తున్నారు. ఈ క్రమంలో కడుపు క్యాన్సర్ సూచించే హెచ్చరిక సంకేతాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!కడుపు క్యాన్సర్‌ను గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారు. కడుపులో క్యాన్సర్ కణాలు పెరగడం ప్రారంభించినప్పుడు ఇది సంభవిస్తుంది. ఇది కడుపులోని ఏ భాగంలోనైనా రావచ్చు. అయితే, చాలా సందర్భాలలో, కడుపు ప్రధాన భాగంలో ఇది కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఈ వ్యాధి సాధారణంగా నెమ్మదిగా మొదలవుతాయి. దీని ప్రారంభ సంకేతాలు ఎసిడిటీ, అజీర్ణం లేదా అప్పుడప్పుడు వచ్చే కడుపు నొప్పి వంటి సాధారణ జీర్ణక్రియ సమస్యలను పోలి ఉండటం వల్ల దీనిని గుర్తించడం చాలా కష్టం. అయితే, హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స ఫలితాలు మెరుగుపడతాయంటున్నారు నిపుణులు.

**నిరంతర అజీర్ణం :** ఉదర పై భాగంలో స్వల్పంగా ఎసిడిటీ లేదా మంట కలగడం సాధారణం. అయితే, ఇది పదేపదే లేదా నిరంతరం వస్తున్నప్పుడు, అది కడుపు క్యాన్సర్ సంకేతం కావచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో సాధారణంగా మంట లేదా అసౌకర్యమనేది బొడ్డు పైన అనిపిస్తుందట. సాధారణ యాంటాసిడ్లు లేదా జీవనశైలి మార్పులతో ఇది తగ్గకపోవచ్చుట. ఎటువంటి స్పష్టమైన కారణం లేనప్పటికీ, ఈ రకమైన అజీర్ణం వారాల పాటు లేదా నెలల తరబడి మళ్లీ మళ్లీ వస్తూ ఉంటుంది.

**కడుపు నిండినట్లు అనిపించడం :** తక్కువ పరిమాణంలో ఆహారం తీసుకున్నప్పటికీ, కడుపు నిండినట్లు అనిపిస్తుందని అష్ట్రం.బఎ అధ్యయనం పేర్కొంది. కడుపు విపరీతంగా నిండిపోయినట్లు, బిగుతుగా లేదా బరువుగా అనిపించడం వల్ల వ్యక్తి భోజనం మధ్యలోనే తినడం ఆపేయవచ్చంటున్నారు నిపుణులు. కడుపు పై భాగం లేదా మధ్య భాగంలో గడ్డ పెరగడం వల్ల ఇలా అనిపిస్తుందని చెబుతున్నారు.

**కారణం లేకుండా బరువు తగ్గడం :** డైటింగ్ లేదా వ్యాయామం చేయకుండానే బరువు తగ్గడం ఆందోళకరమైన విషయం. కడుపు క్యాన్సర్‌లో గడ్డలు అనేవి జీర్ణక్రియకు, పోషకాల శోషణకు అడ్డుపడటం వల్ల క్రమంగా బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇది ఆకలిని కూడా తగ్గిస్తుందట. దీనివల్ల వ్యక్తి తక్కువగా తినొచ్చు. శరీరం క్యాలరీలను, పోషకాలను సమర్థవంతంగా గ్రహించలేకపోవచ్చుట. ఇది శరీరం కృశించిపోవడానికి, బలహీనతకు, కండరాల క్షీణతకు దారితీస్తుందట.

**నిరంతర కడుపు నొప్పి లేదా అసౌకర్యం :** కడుపు పైభాగంలో మొండిగా, నిరంతరంగా వచ్చే నొప్పి లేదా అసౌకర్యం మరొక ముఖ్యమైన సంకేతమని ఎవ్‌వతీష్ట్రముశ్రీష్ట్ర.జఱఎ.స్త్రశీజ. అధ్యయనం పేర్కొంది. తిన్న ఆహారం సరిపడక అప్పుడప్పుడు వచ్చే కడుపు నొప్పిలా కాకుండా, ఈ నొప్పి తగ్గకుండా వస్తుందట. అలాగే, కాలక్రమేణా నెమ్మదిగా తీవ్రమవుతుందట. ఇది సాధారణంగా బొడ్డుకు సరిగ్గా పై భాగంలో అనిపిస్తుందని చెబుతున్నారు. ఈ నొప్పి గడ్డ వల్ల గానీ, కడుపు లోపలి పొరపై పుండ్లు ఏర్పడటం వల్ల గానీ లేదా సమీపంలోని ఇతర అవయవాలపై ఒత్తిడి పడటం వల్ల గానీ రావచ్చు. కొన్నిసార్లు ఈ నొప్పి రాత్రి సమయాల్లో లేదా భోజనం చేసిన తర్వాత మరింత ఎక్కువగా అనిపిస్తుందట.

**వికారం, వాంతులు :** తరచుగా వికారం అనిపించడం లేదా భోజనం చేసిన తర్వాత పదేపదే వాంతులు కావడం కడుపులో సమస్య ఉన్నదనడానికి సంకేతం కావచ్చని ఎశ్రీవజవశ్రీఖఅఎఎశ్రీఱఅఱఎ అధ్యయనం పేర్కొంది. కడుపు క్యాన్సర్ ఉన్న కొన్ని సందర్భాల్లో, గడ్డ ఉదర ద్వారం వద్ద అడ్డుపడటం వల్ల పదేపదే వాంతులు అవుతాయని చెబుతున్నారు

**నల్లటి లేదా తారు రంగు మల విసర్జన లేదా మలంలో రక్తం :** నల్లగా, తారు రంగులో ఉండే మలం అనేది కడుపుతో సహా జీర్ణవ్యవస్థ పైభాగంలో రక్తస్రావం జరుగుతోందనడానికి సంకేతమంటున్నారు నిపుణులు. రక్తం ప్రేగుల గుండా ప్రయాణించేటప్పుడు నల్లగా మారుతుంది, ఇది కడుపులోని గడ్డ వల్ల కలిగే పుండును సూచిస్తుంది. కొన్నిసార్లు ఈ రక్తస్రావం చాలా నెమ్మదిగా జరిగి బయటకు స్పష్టంగా కనిపించకపోవచ్చు, కానీ ఇది రక్తహీనతకు దారితీస్తుంది. దీనివల్ల చర్మం పాలిపోవడం, బలహీనత, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు. మలంలో రక్తం నేరుగా కనిపించడం కూడా ఒక ప్రమాదకరమైన హెచ్చరిక సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా.. ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు

మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.



### దాహం పెరుగుతుంది

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

### నోటి దుర్వాసన దీని లక్షణమే..

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్ల తాగాల్సి వస్తుంది.

### మలబద్ధకం

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.

### ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

### ఒంటి నొప్పులు..

ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

# తిరుమల, విశాఖ ఎర్రమట్టి దిబ్బలకు అంతర్జాతీయ ఖ్యాతి

**యునెస్కో తాత్కాలిక జాబితాలో తిరుమల, ఎర్రమట్టి దిబ్బలు**

**ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా కీలక ముందడుగు**

**భారత్ నుంచి మొత్తం ఏడు ప్రదేశాలకు చోటు**

**జాబితాలో డెక్కన్ ట్రాప్స్, మేఘాలయ గుహలు కూడా**

**ఎక్స్ వేదికగా ప్రకటించిన భారత ప్రతినిధి బృందం**





ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రఖ్యాత సహజ సంపదలకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కే అవకాశం ఏర్పడింది. కలియుగ వైకుంఠంగా పేరుగాంచిన తిరుమల కొండలు, విశాఖపట్నంలోని ఎర్రమట్టి దిబ్బలు యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. ఇది ప్రపంచ వారసత్వ హోదాను సాధించే దిశగా ఒక కీలకమైన ముందడుగు.భారత్ నుంచి మొత్తం ఏడు సహజ వారసత్వ ప్రదేశాలను యునెస్కో తన తాత్కాలిక జాబితాలో చేర్చినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధి బృందం ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈ రెండు ప్రదేశాలు ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందనున్నాయి.ఈ జాబితాలో ఏపీకి చెందిన ప్రదేశాలతో పాటు, మహారాష్ట్రలోని పాంచని-మహాబలేశ్వర్‌లోని డెక్కన్ ట్రాప్స్, కర్ణాటకలోని ఉడుపిలోని సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్, మేఘాలయలోని మేఘాలయన్ ఏజ్ గుహలు ఉన్నాయి. అలాగే, నాగాలాండ్‌లోని నాగా హిల్ ఓఫియోలైట్, కేరళలోని వర్కాల క్లిఫ్ కూడా ఈ జాబితాలో స్థానం దక్కించుకున్నాయని అధికారులు తెలిపారు. తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకోవడం ప్రపంచ వారసత్వ హోదా పొందడంలో మొదటి, కీలకమైన అడుగుగా భావిస్తారు.

**రమాయణం**

# అమ్మగార్లు.. అయ్యగార్లు

మొదట్లో మా ఇంట్లో వంటకు అయ్యగారు ఉండేవారు. అయితే, మేము మిడిల్ స్కూల్‌కు వచ్చేసరికి అమ్మే వంట చేసేది. ఏరోజూ ఏడెనిమిది మందికి తక్కువ కాకుండా తను వండాల్సి ఉండేది. అయినా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వంటల కోసం అయ్యగార్లు, అమ్మగార్లూ వచ్చేవారు. 'ఆడ ఇక మా నాన్న తన అమ్మమ్మకూ, తాతయ్యకూ దత్తపుత్రుడు కనుక వాళ్లిద్దరికీ తద్దినాలు పెట్టేవాడు. అది చాలా ఖర్చు, శ్రమతో కూడిందైనా, నాన్న తన ఎనభై మూడో ఏట చనిపోయేదాకా.. సుమారు తన పద్నాలుగో ఏట నుంచీ.. అంటే డబ్బై ఏళ్లపాటు ఎంతో శ్రద్ధగా ఆబ్దికాలు పెట్టేవాడు. "ఎందుకు నానా ఈ తద్దినం పెట్టడం?!" అని ఓసారి అడిగాను. దానికి నాన్న ఎంతో ఓపిగ్గా.. "మనం రోజూ అన్నం తింటం గద! మరి పై లోకానికి పోయినోళ్లకు ఎవరు పెడతరు?! మనకు ఒక సంవత్సరం అయితె వాండ్లకు ఒకరోజు అన్నట్టు. అందుకోసం వాండ్లకు ఏడాదికొక్కసారి పిండాలు పెట్టాలె. దాన్ని కాకులకో, పక్షులకో పెడుతం. వాండ్లు పక్షుల రూపంల ఒచ్చి తినిపోతరని, అట్ల వాండ్ల దీవెనలు ఉంటయని పెద్దవాండ్ల నమ్మకం!" అని చెప్పాడు. అట్లాగే ఇంకోమాట కూడా చెప్పాడు.. "పెద్దవాండ్ల విశ్వాసం కోసం అది చెయ్యాలె. ఆ పేరుతోటి ఆరోజు ఒక పదిమంది ఆకలితోటి ఉన్నవాండ్లకు భోజనం పెడితే బాగుంటదని నాకనిపిస్తది".. ఆ మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. వారం ముందే ఓ జీతగాడిని వెంటపెట్టుకుని వెళ్లి కిరాణా సామాను తెచ్చేవాడు నాన్న. అప్పుడే కాదు.. నాన్న ఎప్పుడు ఇంట్లోకి సామాను తెచ్చినా నాకూ, అక్కకూ చెరో బిస్కట్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చేవాడు. మేము వాటికోసమే ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవాళ్లం. అదే మాకు చాలా గొప్ప ఔట్ సైడ్ ఫుడ్. అదికూడా తరచుగా ఉండేది కాదు. ఏదైనా ఇంట్లో చేసింది తినడమే! తద్దినం రోజు ఏడింటికల్లా మా పక్కఊరు చాగల్లు నుంచి సింహయ్యగారు, ఆయన కొడుకు కేశవయ్యగారు వచ్చేవారు. ఆరోజు వీలైనంత వరకూ నేను బడి ఎగ్గొట్టడం తప్పనిసరి అని వేరే చెప్పక్కర్లేదుగా! వాళ్లు వస్తూనే మడిపంచెలు కట్టుకుని వంటింట్లో దూరేవారు. అమ్మకు ఒక్క వంట తప్పేది కానీ, మిగతా అన్ని పనులూ పెరిగేవి. ఓ పది రకాల వంటకాల కోసం బోలెడు కూరగాయలు కోసి, మిగతా వంట సామానంతా సిద్ధం చేసి ఉంచేది. వాళ్లు పిలిస్తే చాలు.. "ఏం గావాలె అయ్యగారూ!" అంటూ సిద్ధంగా ఉండేది. దగ్గరి మూడు కుటుంబాల బంధువులు భోజనాలకు



వచ్చేవారు. ఇంకా పదిమంది దాకా పనివాళ్లకు, ఆరోజున ఎందరొస్తే అందరు బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టడం అమ్మవంతే అయ్యేది. మేము కాస్త పెద్దయిం తరువాత వడ్డనలు చేసేవాళ్లం. అప్పుడు గ్రైండర్లు, మిక్సర్లు లేవు గనుక.. అయ్యగార్లు పెద్దరోటి ముందు కూచుని పప్పు రుబ్బేవారు. వాళ్లు చేసే గారెలు భలే రుచిగా ఉండేవి. మమ్మల్ని వంట చేసేటప్పుడు ఆ దరిదాపులక్కూడా రానిచ్చేవారు కాదు. మాకేమో మగవాళ్లు ఎలా వండుతారో చూద్దామని కుతూహలం. "ఇటు దిక్కు రావొద్దు.. మడి!" అనేవారు. ఇంకొక బ్యాచ్ బ్రాహ్మలు వచ్చి ఏవో మంత్రాలు చదివి నాన్నచేత తద్దినం పెట్టించేవారు. తరువాత అందరం వరుసగా కింద చిన్న చాపల మీద కూచొని.. ముందు విస్తర్లు పరుచుకుని ఉంటే, వాళ్లే వడ్డన చేసేవారు. సింహయ్య గారు అప్పటికే చాలా పెద్దాయన. ఆయనకు వంగడం వచ్చేది కాదు. అన్నిటినీ నిలబడే అంతెత్తునుంచి తపుక్కున విస్తట్లో వేసేవాడు. అయినా మేము భయంతో ఏమీ అనేవాళ్లం కాదు. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కేశవయ్యగారు కూడా వచ్చేవాడు. నాన్న చనిపోయాక ఇక మా పుట్టింట్లో తద్దినాలు పెట్టడం ఆగిపోయింది. కొన్నాళ్లకు కేశవయ్యగారు మంచాన పడ్డాడని తెలిసి వెళ్లి చూసొచ్చాను. ఆయన పోయినా ఇప్పటికీ ఆ కుటుంబంతో టచ్‌లోనే ఉన్నాం. మా చిన్నప్పుడు కూనూరు నుంచి లక్ష్మయ్యగారు, వాళ్లన్నయ్య మత్స్యయ్యగారు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. "గీ మత్స్యయ్య ఏం పేరు? గీయిన మనిషే గద.. చేప పేరు పెట్టుకున్నడేంది?!" అని అమ్మను అడిగాను. "నీకు కోతి మాటలు బాగ ఎక్కువయినయ్! శ్రీ మహావిష్ణువు దశావతారాలల్ల మొదటిది ఏంది?!" అన్నది అమ్మ. నాకు ఠక్కున గుర్తొచ్చింది. "తిరుపతి, యాదగిరి, సింహాచలం.. అని దేవుని గుళ్లుండే ఊరి పేర్లు పెట్టుకున్నట్టే.. మత్స్యగిరి, వరాహగిరి, కూర్మనాథం అని కూడా పెట్టుకుంటరు" అన్నది అమ్మ. అప్పుడర్థమైంది. ఇంతకూ ఈ మత్స్యయ్యగారి గురించి చెప్పొచ్చేదేంటంటే.. ఈయన ఎప్పుడూ మా అక్కాచెల్లెల్లిద్దరి మధ్యలో ఏదోఒక గొడవో, పోటీనో పెట్టి తమాషా చూద్దామనుకునేవాడు. మేమేం తక్కువా?! ఆదర్శ అక్కాచెల్లెళ్లం మరి! మాకు పెద్దగా కొట్లాటలే వచ్చేవి కావు. ఆయన మా పుట్టినరోజులు గుర్తు పెట్టుకుని ఒకరోజు ముందుగానే వచ్చేవాడు. పుట్టినరోజంటే పెద్దగా కేక్ కట్‌చేయడం, స్నేహితుల్ని పిలవడం, సెలెబ్రేట్ చేయడం లాంటివి మాకు తెలియదు. ఆరోజు తలంటు పోసుకోవడం, ఉన్నంతలో కొత్త బట్టలు వేసుకోవడం చేసేవాళ్లం. అమ్మ ఏదైనా స్వీట్ చేసేది. ఈ మత్స్యయ్యగారు రాగానే.. "పోయినేడు మీ చెల్లె పుట్టినరోజుకు లడ్డూలు చేయించింది అమ్మ. మరి నీ పుట్టిన్రోజుకు ఏం చెయ్యాలె చెప్పు?! మీ అమ్మను అడుగు" అంటూ అక్కను రెచ్చగొట్టేవాడు. ఇక అక్క లడ్డూలు చేయించమని అమ్మ వెంటపడేది. ఆ తరువాత వచ్చే నా పుట్టినరోజు కూడా అంతే! "మీ అక్క పుట్టినరోజుకు లడ్డూలు చేసిన్రు. నీకు గూడ గవ్వే అయితె ఏం బావుంటది?! మంచిగ మైసూర్ పాక్ చేయించుకో.. అమ్మ తోటి చెప్పుపో!" అనేవాడు. "ఏం జెయ్యాల్నో అమ్మకు తెల్సు" అనేదాన్ని నేను. ఈయన కథ ఇలా ఉంటే.. అప్పుడప్పుడూ మా ఇంటికి కూనూరు నుంచి అండమ్మగారూ, లక్ష్మయ్యగారూ వచ్చేవారు. వాళ్ల ముచ్చట్ల గురించి వచ్చేవారం చెప్పుకొందాం!

# రష్యా ఆయిల్‌కు అమెరికా బ్రేక్- భారత్‌కు ముప్పు తప్పదా

**రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా కొత్త ఆంక్షల బిల్లు**

**రష్యా చమురు కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాల భారీ సుంకాలు**

**100 శాతం టారిఫ్‌లతో భారత ముడి చమురు సరఫరాకు పెంచుతోన్న ముప్పు**

రష్యా ముడి చమురు దిగుమతులను అడ్డుకునేందుకు అమెరికా తీసుకొచ్చిన కొత్త బిల్లు ప్రభావం వెంటనే భారత్, చైనాలపై ఉండదని కేప్లర్ అభిప్రాయపడింది. ఈ బిల్లు చట్టం రూపం దాల్చే వరకు భారత్, చైనాల చమురు దిగుమతులపై తక్షణ పరిణామాలు ఉండకపోవచ్చని అంచనా వేసింది.రష్యా చమురు, గ్యాస్ విక్రయాలను అడ్డుకునే లక్ష్యంతో రూపొందించిన లిండ్సే ఓ గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2026 బిల్లుకు అమెరికా సెనేట్‌లో ఆమోదం లభించింది. ఈ బిల్లు చట్టంగా మారితే రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాల దిగుమతులపై ఏకంగా 100 శాతం టారిఫ్‌లను విధించే అధికారం అధ్యక్షుడు ట్రంప్‌నకు లభిస్తుంది. అయితే ఈ బిల్లు ఇంకా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ ఆమోదం పొందాల్సి ఉంది. సెనేట్ ఆమోదం భారత ముడి చమురు సరఫరాకు ముప్పును పెంచుతున్నప్పటికీ ఇది తక్షణమే ఎలాంటి ప్రభావం ఉండదని అంతర్జాతీయ డేటా, విశ్లేషణల వేదిక కేప్లర్ వెల్లడించింది. ప్రస్తుత పరిణామం ఇంధన ప్రవాహాలను ఆపలేదని స్పష్టం చేసింది.

**ఆంక్షలు మరింత కఠినతరం**

అమెరికా యంత్రాంగం ఈ ఆంక్షలను ఎంత కఠినంగా అమలు చేస్తుంది అలాగే ఏవైనా మినహాయింపులు ఇస్తుందా అనే దానిపైనే దీని ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. గత అనుభవాలను పరిశీలిస్తే చమురు సరఫరా భద్రతపై ఆందోళనలు తలెత్తినప్పుడు, ముడి చమురు లభ్యతకు అనవసరంగా అంతరాయం కలిగించే చర్యలకు పాల్పడే అవకాశాలు తక్కువని అభిప్రాయపడింది.

**రష్యా చమురు భారత్‌కు రక్షణ కవచం**

పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల వేళ రష్యా చమురు భారత్‌కు రక్షణ కవచంగా మారింది. ఇలాంటి తరుణంలో రష్యా ముడి చమురును తక్షణమే భర్తీ చేయడం దాదాపు అసాధ్యమని అంటున్నారు. ఒకవేళ రష్యా చమురు సరఫరా ఆగిపోతే ప్రపంచ ఇంధన మార్కెట్లో ముడి చమురు ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉంది. దీని వల్ల భారత్ ముడి చమురు దిగుమతుల బిల్లు పెరుగుతాయని అప్పుడు దేశ ఇంధన భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతాయని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



**మాస్కో ఆసియా దేశాలకు భారీ డిస్కౌంట్**

2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షలతో మాస్కో ఆసియా దేశాలకు భారీ డిస్కౌంట్‌తో చమురును అందించింది. ఈ క్రమంలో భారత్ రష్యా చమురుపై ఎక్కువగా ఆధారపడటం మొదలుపెట్టింది. 2021లో రోజుకు కేవలం లక్ష బ్యారెళ్ల లోపు ఉన్న దిగుమతులు 2023 నాటికి 1.8 మిలియన్ బ్యారెళ్లకు చేరుకున్నాయి. కేప్లర్ డేటా ప్రకారం 2026 జులైలో భారత రిఫైనరీలు రికార్డు స్థాయిలో 2.8 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును దిగుమతి చేసుకున్నాయి. ఇది దేశ మొత్తం ముడి చమురు దిగుమతుల్లో ఏకంగా 55.5 శాతానికి సమానంగా ఉంది. దీంతో భారత దిగుమతుల్లో రష్యా అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా నిలిచింది.అయితే, కెప్లర్ నివేదిక ప్రకారం, పశ్చిమాసియా సరఫరా మార్గాల్లో ఏర్పడే అంతరాయాల నుంచి భారతీయ రిఫైనరీల ప్రభావాన్ని తగ్గించడానికి, రష్యన్ ముడి చమురు ఒక ముఖ్యమైన సరఫరా రక్షణగా (సప్లై హెడ్జ్‌గా) మారిందని తెలిపింది. ప్రస్తుత పరిమాణంలో రష్యన్ ముడి చమురు స్థానంలో మరొకదాన్ని తీసుకురావడం స్వల్పకాలంలో అసాధ్యం కాకపోయినా కష్టమని భావిస్తోంది. అందువల్ల, భారత్‌కు లేదా ఇతర ఆసియా కొనుగోలుదారులకు రష్యా సరఫరాలను వేగంగా తగ్గించడమనేది, ప్రపంచ చమురు సమతుల్యతను కఠినతరం చేసి, ముడి చమురు ధరలపై ఒత్తిడిని పెంచుతుంది.

# యూపీఐ పేమెంట్స్ ఛార్జీలు- కేంద్రం కీలక ప్రకటన

**యూపీఐ లావాదేవీల ఛార్జీలపై కేంద్ర ఆర్థిక శాఖ కీలక ప్రకటన**

**వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలకు ఛార్జీలు ఉండవని స్పష్టం**





యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించనున్నారంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. యూపీఐ వినియోగదారులపై ఎలాంటి ఛార్జీలు విధించబోమని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. పర్సన్ టు పర్సన్ మధ్య జరిగే యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని పేర్కొంది. వ్యాపారులకు సంబంధించిన లావాదేవీల్లోనూ అత్యధిక శాతం ఎలాంటి ఛార్జీలు లేకుండానే కొనసాగుతాయని స్పష్టతనిచ్చింది. ఈ ఛార్జీలు డెబిట్, క్రెడిట్ కార్డు లావాదేవీలపై ప్రస్తుతం ఉన్న మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) కంటే చాలా తక్కువగా ఉంటాయని కేంద్రం పేర్కొంది. అంటే యూపీఐ వినియోగిస్తున్న సాధారణ ప్రజలు ఛార్జీల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించింది.

**యూపీఐ ఛార్జీలపై కేంద్రం స్పష్టత**

మరోవైపు, 2007 నాటి చట్టాన్ని సవరించే బిల్లుకు లోక్‌సభ ఇటీవల ఆమోదం తెలిపింది. బ్యాంకులు, ఇతర చెల్లింపు సేవల సంస్థలకు యూపీఐతో పాటు ప్రభుత్వం నోటిఫై చేసే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై రుసుములు విధించేందుకు వీలు కల్పించేలా ఈ సవరణ తీసుకొచ్చారు. ఫలితంగా ఇకపై యూపీఐ లావాదేవీలన్నింటిపైనా ఛార్జీలు విధిస్తారనే ప్రచారం తలెత్తింది. ఈ నేపథ్యంలోనే, చట్ట సవరణను యూపీఐ వినియోగదారులపై ఛార్జీలు విధించే నిర్ణయంగా చూడకూడదని కేంద్ర ఆర్థికశాఖ వివరణ ఇచ్చింది.యూపీఐ బలోపేతానికి స్థిరమైన ఆదాయ నమూనా అవసరం.ఇదిలా ఉండగా, యూపీఐ లావాదేవీల సంఖ్య భారీగా పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కేంద్రం భావిస్తోంది. సైబర్ భద్రత, మోసాల నివారణ, సాంకేతిక మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిరంతరం భారీ పెట్టుబడులు అవసరమవుతున్నాయని తెలిపింది. యూపీఐ సేవలను దేశంలోని గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాలకు మరింత విస్తరించాల్సి ఉందని నొక్కి చెప్పింది. యూపీఐ వ్యవస్థ దీర్ఘకాలంలో స్వయం సమృద్ధిగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కేవలం ప్రభుత్వ సబ్సిడీలపైనే ఆధారపడటం ద్వారా భవిష్యత్తు అవసరాలను తీర్చడం సాధ్యం కాదని వెల్లడించింది. యూపీఐ బలోపేతం కోసం స్థిరమైన ఆదాయ నమూనా అవసరమని పేర్కొంది.

**భవిష్యత్తులో ఎండీఆర్ విధిస్తే ఎలా**

మరోవైపు, భవిష్యత్తులో ఎండీఆర్ విధించాల్సిన అవసరం ఏర్పడితే దానిపై తుది నిర్ణయం ఎలా ఉంటుందనే విషయాన్ని కూడా కేంద్రం వివరించింది. పన్నులు, ఇతర చట్టాల సవరణ బిల్లు-2026 పార్లమెంట్ ఆమోదం పొందిన తర్వాత, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నేతృత్వంలోని 'యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ' ఎండీఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొంది. కానీ, అన్ని వ్యాపార లావాదేవీలకు ఒకే విధంగా ఎండీఆర్ విధించే అవకాశం లేదని స్పష్టతనిచ్చింది. నిర్ణీత పరిమితికి మించి జరిగే కొన్ని మర్చంట్ లావాదేవీలకు మాత్రమే నామమాత్రపు రుసుము ఉండే అవకాశం ఉందని తెలిపింది.

**ఛార్జీల విషయంపై విదేశీ ఒత్తిళ్లు**

యూపీఐ సేవల ఛార్జీల విషయంపై విదేశీ శక్తుల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలను కేంద్రం ఖండించింది. అవన్నీ పూర్తిగా అవాస్తవాలని కొట్టిపారేసింది. విదేశీ ఒత్తిళ్లు ఉంటే 2016లో యూపీఐని ప్రవేశపెట్టే చర్యలు తీసుకునేవాళ్లం కాదని పేర్కొంది. అదేవిధంగా, 2020 నుంచి వ్యాపారులకు, పౌరులకు ఉచితంగా సేవలు అందించడం, ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ ఇంటర్‌ఆపరేబుల్ చెల్లింపుల వ్యవస్థగా తీర్చిదిద్ది ఉండేది కాదని పేర్కొంది. యూపీఐ భారత సొంత ఆవిష్కరణ అని, రానున్న దశాబ్దాల పాటు దాని సుస్థిరతను నిర్ధారిస్తూనే, పౌరులకు దానిని ఉచితంగా అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపింది. ఇక, యూపీఐ సేవల విషయానికొస్తే, 2016-17లో ప్రారంభమైన యూపీఐ, ప్రస్తుతం దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారింది. చాలా మంది తమ రోజూవారి చెల్లింపుల కోసం యూపీఐనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. విదేశాల్లోనూ దీని ప్రభావం అధికంగా ఉంది.

# మీ గెలుపు భావితరాలకు స్ఫూర్తి.. కామన్వెల్త్ విజేతలతో ప్రధాని మోదీ

**గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ పతక విజేతలతో ప్రధాని మోదీ భేటీ**

**మీ విజయాలు భావితరాలకు గొప్ప స్ఫూర్తి అని ప్రశంస**

**రెజ్లింగ్, షూటింగ్ వంటివి లేకున్నా 39 పతకాలు సాధించిన భారత్**


**బాక్సింగ్‌లో 7 స్వర్ణాలతో చరిత్ర సృష్టించిన భారత బాక్సర్లు**

**జూడోలో తొలిసారి స్వర్ణాలు సాధించి చారిత్రాత్మక విజయం**

గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత పతక విజేతలను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. నిన్న తన నివాసంలో అథ్లెట్లతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన, వారి విజయాలు దేశానికి గర్వకారణమని, రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని కొనియాడారు. ఈ విజయం కేవలం క్రీడాకారులది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ గేమ్స్‌లో భారత్ అద్భుత ప్రతిభ కనబరిచి, మొత్తం 39 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇందులో 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హాకీ, షూటింగ్ వంటి కీలక క్రీడాంశాలు ఈసారి లేకపోయినా, భారత అథ్లెట్లు ఈ స్థాయిలో రాణించడం విశేషం. ముఖ్యంగా పారా-అథ్లెట్ల ప్రదర్శనను ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "మీరు కేవలం పతకాల సంఖ్యను పెంచలేదు, యావత్ తరాన్ని సిద్ధం చేశారు. పాఠశాలలకు వెళ్లి మనం చెప్పే మాటల కన్నా, మీ పతకాలు పిల్లల్లో ఎక్కువ స్ఫూర్తిని నింపుతాయి" అని అన్నారు.

**బాక్సింగ్, జూడోలో చారిత్రక విజయాలు**

ఈ గేమ్స్‌లో భారత బాక్సర్లు సంచలనం సృష్టించారు. ఏకంగా 7 స్వర్ణాలు, 3 రజతాలు సాధించి సత్తా చాటారు. ముఖ్యంగా మహిళా బాక్సర్ల ప్రదర్శన అత్యుత్తమంగా నిలిచింది. భారత బాక్సర్ల వీడియోలు చూసి ప్రపంచ బాక్సర్లు ఇప్పుడు మనల్ని చూసి భయపడుతున్నారని మోదీ సరదాగా వ్యాఖ్యానించారు.అలాగే, జూడోలోనూ భారత్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. అస్మితా డే, హర్ష్





సింగ్ స్వర్ణాలు గెలిచి కామన్వెల్త్ గేమ్స్ జూడోలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళ, పురుష అథ్లెట్లుగా రికార్డు సృష్టించారు. ఖేలో ఇండియా పథకం ద్వారా వచ్చిన ఈ క్రీడాకారులు దేశానికి గర్వకారణంగా నిలిచారని ప్రధాని అన్నారు. అథ్లెటిక్స్‌లోనూ గుల్వీర్ సింగ్ ఒకే గేమ్స్‌లో రెండు పతకాలు (10,000మీ రజతం, 5,000మీ కాంస్యం) సాధించిన తొలి భారతీయుడిగా చరిత్రకెక్కాడు.

**మీరాబాయితో భావోద్వేగ క్షణాలు**

ఈ సమావేశంలో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చానుతో ప్రధాని మోదీ మాట్లాడిన సందర్భం భావోద్వేగంగా మారింది. తన కష్టాలను, పోడియంపై నిల్చున్నప్పుడు కలిగిన అనుభూతిని తలుచుకుని మీరాబాయి కంటతడి పెట్టారు. దీనికి స్పందించిన మోదీ.. "నీ కన్నీటి ప్రతి చుక్కా బంగారు పతకంతో సమానం" అని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ విజయాలు కొనసాగించాలని, మళ్లీ ఇక్కడే కలుద్దామని అథ్లెట్లకు ఆయన ధైర్యం చెప్పారు.

# 2027 ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడాలా?.. రహానే ఏమన్నాడంటే...!





భారత క్రికెట్ జట్టులో సీనియర్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై చర్చ నడుస్తున్న వేళ, టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఈ దిగ్గజ ఆటగాళ్ల భాగస్వామ్యంపై బీసీసీఐ, సెలెక్టర్లు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో ఉండాలని సూచించాడు. వారిని కేవలం వయసు ఆధారంగా అంచనా వేయడం సరికాదని రహానే అభిప్రాయపడ్డాడు.మైదానంలో రోహిత్, కోహ్లీల అపార అనుభవానికి ప్రత్యామ్నాయం లేదని రహానే స్పష్టం చేశాడు. ఒత్తిడిని జయించడంలో, జట్టును నడిపించడంలో వారి పాత్ర అమూల్యమైనదని అన్నాడు. ముఖ్యంగా జట్టు పునర్నిర్మాణ దశలో ఉన్నప్పుడు, ఇలాంటి సీనియర్లు జట్టులో ఉండటం సమతుల్యతకు ఎంతో అవసరమని విశ్లేషించాడు. కెప్టెన్‌గా రోహిత్ శర్మ, నిలకడైన బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ భారత జట్టుకు గొప్ప ఆస్తి అని గుర్తుచేశాడు.రాబోయే 2027 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ ఇద్దరు ఆటగాళ్ల విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఒక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని రహానే సూచించాడు. సెలెక్టర్లు తమ ఆలోచనలను ఆటగాళ్లకు ముందుగానే తెలియజేయడం వల్ల, భవిష్యత్తులో ఎలాంటి గందరగోళం ఉండదని పేర్కొన్నాడు. దీనివల్ల ప్రపంచకప్ సమయానికి అత్యంత పటిష్టమైన జట్టును నిర్మించడం సాధ్యమవుతుందని రహానే వివరించాడు.

# విద్యుత్ వాహన రంగంలో కోట్ల ఉద్యోగాలు.. జీతాలూ ఎక్కువే!

**2030 నాటికి ఈవీ రంగంలో 4 కోట్ల ఉద్యోగాలు**

**85-90 శాతం ఉద్యోగాలు పరోక్షంగా ఏర్పడే అవకాశం**

**నియామకాలు ఏటా 15-20 శాతం పెరగనున్నట్లు అంచనా**

**నైపుణ్యం ఉన్నవారికి 45 శాతం వరకు ఎక్కువ జీతాలు**

**బ్యాటరీ, ఛార్జింగ్ రంగాల్లో ఉద్యోగాలు భారీగా పెరిగే ఛాన్స్**

విద్యుత్ వాహనాల (ఈవీ) రంగం దేశంలో భారీగా ఉద్యోగాలు కల్పించనుంది. 2030 నాటికి ఈ రంగంలో 3 కోట్ల నుంచి 4 కోట్ల వరకు కొత్త ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని అడ్‌కో ఇండియా నివేదిక తెలిపింది. బ్యాటరీ తయారీ, ఛార్జింగ్ కేంద్రాలు, వాహనాల సర్వీసింగ్, సాఫ్ట్‌వేర్, ఫ్లీట్ నిర్వహణ, బ్యాటరీ రీసైక్లింగ్ వంటి రంగాల్లో అవకాశాలు పెరగనున్నాయి.ఈ ఉద్యోగాల్లో కేవలం 10-15 శాతం మాత్రమే నేరుగా వాహనాల తయారీకి సంబంధించినవి ఉంటాయని అడ్‌కో అంచనా వేసింది. మిగతా 85-90 శాతం ఉద్యోగాలు ఈవీల చుట్టూ ఏర్పడే ఇతర రంగాల్లో వస్తాయని పేర్కొంది. దీంతో సంప్రదాయ కార్ల తయారీ కేంద్రాలకే ఉద్యోగాలు పరిమితం కావని స్పష్టం చేసింది.ఈవీ రంగంలో నియామకాలు ఏటా 15-20 శాతం పెరగొచ్చని నివేదిక తెలిపింది. ప్రత్యేక నైపుణ్యాలున్న ఉద్యోగులకు డిమాండ్ 35 శాతం వరకు పెరగవచ్చని అంచనా వేసింది. ఈవీ రంగంలో అవసరమైన నైపుణ్యాలు ఉన్నవారికి సంప్రదాయ ఇంజిన్ వాహనాల ఉద్యోగాలతో పోలిస్తే 45 శాతం వరకు ఎక్కువ జీతాలు లభించే అవకాశం ఉందని పేర్కొంది.ఈవీ రంగంలో ఉద్యోగాల్లో వాహనాల తయారీ వాటా 50-55 శాతం ఉండొచ్చని అడ్‌కో తెలిపింది. బ్యాటరీ తయారీ, ఛార్జింగ్ సదుపాయాలు, బ్యాటరీల రీసైక్లింగ్ రంగాల్లో వేగంగా ఉద్యోగాలు పెరగనున్నాయి.దేశంలో ఈవీల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ఛార్జింగ్ కేంద్రాలు, సర్వీసింగ్ కేంద్రాలు, ఫ్లీట్ నిర్వహణకు సిబ్బంది అవసరం పెరుగుతుంది. ఢిల్లీలో జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఈవీ పాలసీ కింద దాదాపు 30 వేల ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కొత్త ఉద్యోగాల్లో 40-50 శాతం తొలుత కాంట్రాక్ట్ పద్ధతిలో వచ్చే అవకాశం ఉందని అడ్‌కో తెలిపింది. తర్వాత వాటిలో కొన్ని శాశ్వత ఉద్యోగాలుగా మారొచ్చని పేర్కొంది. ఈవీ రంగం కోసం బ్యాటరీలు, సాఫ్ట్‌వేర్, ఛార్జింగ్ వ్యవస్థలపై నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచించారు.

# మారుతి సుజుకి దూకుడు వచ్చే ఐదేళ్లలో 7 కొత్త ఎస్‌యూవీలు

భారత ఆటోమొబైల్ రంగంలో అగ్రగామిగా ఉన్న మారుతి సుజుకి, తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు భారీ ప్రణాళికలతో ముందుకు వస్తోంది. మారుతున్న వినియోగదారుల అభిరుచులకు



అనుగుణంగా, రాబోయే ఐదారు సంవత్సరాల్లో ఏకంగా 7 కొత్త స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ)ను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు, పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేందుకు ఇప్పటికే ఉత్పత్తి సామర్థ్యాన్ని 5 లక్షల యూనిట్ల మేర పెంచుకున్నట్లు వెల్లడించింది. సంస్థ 2025-26 వార్షిక నివేదికలో ఈ వివరాలను పొందుపరిచింది. మధ్యకాలిక వృద్ధిపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అందుకే ఉత్పత్తి సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరించామని కంపెనీ ఎండీ, సీఈఓ హిసాషి టేకుచి తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే 5 లక్షల యూనిట్ల అదనపు తయారీ సామర్థ్యాన్ని జోడించామని ఆయన వివరించారు. ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కొత్త మోడళ్లను పరిచయం చేయనున్నట్లు స్పష్టం చేశారు.కంపెనీ ఛైర్మన్ ఆర్.సి. భార్గవ భారత కార్ల మార్కెట్ భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తం చేశారు. 2030-31 ఆర్థిక సంవత్సరం నాటికి దేశీయ ప్యాసింజర్ కార్ల పరిశ్రమ 6.1 - 6.3 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని ఆయన అంచనా వేశారు. ముఖ్యంగా, గత ఐదేళ్లతో పోలిస్తే చిన్న కార్ల సెగ్మెంట్ కూడా గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.మారుతీ సుజుకి ఇటీవల అద్భుతమైన పనితీరును కనబరిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 24.22 లక్షల వాహనాలను విక్రయించి రికార్డు సృష్టించింది. ఇందులో 4.47 లక్షల వాహనాల ఎగుమతులు కూడా ఉన్నాయి. వరుసగా మూడో ఏడాది 2 మిలియన్ల వార్షిక అమ్మకాల మార్కును దాటడం విశేషం.ఈ వృద్ధిని కొనసాగించేందుకు కంపెనీ బహుముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. చిన్న కార్ల విభాగాన్ని పునరుద్ధరించడం, ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియోను విస్తరించడం, మల్టీ-పవర్‌ట్రెయిన్ వ్యూహం, ఎగుమతులపై దృష్టి పెట్టడం వంటివి ఇందులో భాగంగా ఉన్నాయి.వీటితో పాటు, పర్యావరణ హితమైన ఇంధనాలపై కూడా మారుతీ ప్రత్యేక దృష్టి సారించింది. తొలి దశలో రూ. 561 కోట్ల వ్యయంతో నాలుగు బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్లాంట్ల ద్వారా దిగుమతి చేసుకునే సీఎన్‌జీకి ప్రత్యామ్నాయం లభిస్తుందని, ఇది పూర్తిగా పునరుత్పాదక ఇంధనమని భార్గవ తెలిపారు. ఈ ప్రాజెక్టుల అనుభవం ఆధారంగా భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆయన సూచించారు.

# ప్రపంచ అథ్లెటిక్స్‌లో చరిత్ర.. హైజంప్‌లో బసంత్‌కు రజతం

**ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్‌లో బసంత్ కుమార్ సంచలనం**

**హైజంప్‌లో 2.21 మీటర్లు ఎగిరి రజత పతకం కైవసం**

**ఈ విభాగంలో పతకం గెలిచిన తొలి భారతీయుడిగా రికార్డ్**

**కోచ్ సహానా కుమారి శిక్షణలో గణనీయంగా మెరుగైన ప్రదర్శన**





ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ బసంత్ కుమార్ మేఘ్వాల్ చారిత్రక ప్రదర్శనతో మెరిశాడు. పురుషుల హైజంప్ ఈవెంట్‌లో 2.21 మీటర్ల ఎత్తును అధిగమించిన బసంత్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విభాగంలో పతకం సాధించిన తొలి భారతీయుడిగా ఆయన చరిత్ర సృష్టించాడు.ఈ పోటీలో 19 ఏళ్ల బసంత్ కుమార్‌తో పాటు అల్జీరియాకు చెందిన యూనెస్ అయాచి, బ్రిటన్‌కు చెందిన ఓటిస్ పూల్ కూడా 2.21 మీటర్ల ఎత్తును విజయవంతంగా క్లియర్ చేశారు. ఆ తదుపరి ప్రయత్నంలో 2.24 మీటర్ల ఎత్తును అధిగమించడంలో ముగ్గురూ విఫలం కావడంతో, 'కౌంట్‌బ్యాక్' నిబంధన ఆధారంగా విజేతలను నిర్ణయించారు. ఈ నిబంధన ప్రకారం తక్కువ ప్రయత్నాల్లో లక్ష్యాన్ని చేరుకున్న అల్జీరియా అథ్లెట్‌కు స్వర్ణం దక్కగా, బసంత్‌కు రజతం, బ్రిటన్ అథ్లెట్‌కు కాంస్య పతకాలు లభించాయి.జాతీయ రికార్డు హోల్డర్ సహానా కుమారి పర్యవేక్షణలో బసంత్ శిక్షణ పొందుతున్నాడు. గతంలో బసంత్ అత్యుత్తమ ప్రదర్శన 2.11 మీటర్లు కాగా, తాజా ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా 10 సెంటీమీటర్ల మేర మెరుగుపరుచుకుని 2.21 మీటర్ల మార్కును అందుకోవడం గమనార్హం.

# అప్పుడు కలవనివ్వలేదు.. ఇప్పుడు అదే హీరోతో!



మలయాళ నటి మమితా బైజు ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉంది. ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. 'డ్యూడ్' 'జన నాయకన్' చిత్రాలతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ఈ శుక్రవారం(ఆగస్టు 14) ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కేరళలో శనివారం జరిగింది. ఇందులో మాట్లాడిన మమిత తన చిన్ననాటి జ్ఞాపకాలని గుర్తుచేసుకుంది. '2015లో సూర్య ఓ కార్యక్రమం కోసం కొచ్చి వచ్చారు. అప్పుడు నేను ఎనిమిది, మా అన్నయ్య ఇంటర్ చదువుతున్నాం. సూర్యని చూసేందుకు అన్నయ్య తన స్నేహితులతో కలిసి కొచ్చి వెళ్లాడు. నేనూ వెళ్తానంటే మా తల్లిదండ్రులు పంపించలేదు. అన్నయ్య సూర్యతో ఫొటో దిగి చూపించాడు. నేను చాలా బాధపడ్డాను. ఇప్పుడు అదే హీరోతో కలిసి నటించే అవకాశం దక్కింది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూర్యతో కలిసి ఒకే వేదికపై నిలబడటం అదృష్టంగా భావిస్తున్నాను' అని మమిత చెప్పుకొచ్చింది. అభిమానిగా సూర్యని చూడాలనుకున్న తనకు.. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప ఆశీర్వాదమని పేర్కొంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 45 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల అమ్మాయితో ప్రేమలో పడటం అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. ఇందులో రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్, నాజర్ తదితరులు కీలక పాత్రలు చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించాడు.

# పోలీసులు నన్ను పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు



ప్రస్తుతం 'రాకా' సినిమాతో బిజీగా ఉన్న అల్లు అర్జున్.. వైజాగ్?లో కనిపించాడు. తన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్‌ని ఘనంగా ప్రారంభించాడు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఇలా ఓ మల్టీప్లెక్స్ ఉండగా.. ఇప్పుడు విశాఖపట్నంలోనూ లాంచ్ చేశాడు. ఈ సందర్భంగా బన్నీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడు వైజాగ్ రోడ్డుపై అస్సలు నడవలేకపోతున్నానని చెప్పుకొచ్చాడు. 'గంగోత్రి' రోజుల్లో వైజాగ్ రోడ్డుపై ఎవరూ నన్ను గుర్తుపట్టేవారు కాదు. ఇప్పుడు అదే రోడ్డుపై నడవలేకపోతున్నాను. 'రాకా' షూటింగ్ ముంబైలో జరుగుతోంది. వైజాగ్ ప్రజల కోసం ఒక రోజు బ్రేక్ అడిగి వచ్చాను. అయితే పోలీసులు నన్ను ఎయిర్‌పోర్ట్ నుంచి పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు. వాళ్లకు థ్యాంక్స్' అని అన్నాడు. ఇక ఎదురుగా ఉన్న కొందరు అభిమానులు ఫొటో కావాలని అడగడంతో అందరూ ఇక్కడికి వచ్చేయండి అని స్టేజీపైకి ఆహ్వానించాడు. ఫ్యాన్స్‌కి నో అని చెప్పటం నా వల్ల కాదమ్మా అని అన్నాడు. ఎనిమిది స్క్రీన్లు ఉన్న ఈ మల్టీప్లెక్స్‌లో 'పుష్ప'లో గడ్డం కింద చేయి పెట్టే పోజు ఉన్న బన్నీ బొమ్మని ప్రదర్శన కోసం ఉంచారు. అలానే అల్లు అర్జున్‌కి సంబంధించిన పలు సినిమా స్టిల్స్ కూడా ఉంచారు. ఇకపోతే ప్రస్తుతం 'రాకా' చేస్తూ బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ తన 23వ మూవీ చేయనున్నాడు. దీని ప్రీ ప్రొడక్షన్ వర్క్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

# వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్..

## ట్రైలర్ వచ్చేది ఆరోజే!




భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'మీర్జాపూర్' ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగష్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) వంటి ఐకానిక్ పాత్రలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్-ప్యాక్డ్ యాక్షన్‌తో సరికొత్త రికార్డులు సృష్టించేందుకు ఈ ఫ్రాంచైజీ సిద్ధమైంది. ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4న కేవలం థియేటర్లలో మాత్రమే విడుదల కానుంది

# 'చెన్నై లవ్ స్టోరీ' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.. కిరణ్ అబ్బవరం మూవీ స్ట్రీమింగ్ ఎక్కడ అంటే?



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్ స్టోరీ' థియేటర్లలో మంచి స్పందన అందుకుంది. జులై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది. 'బేబీ' సినిమాతో సక్సెస్ అందుకున్న సాయి రాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సుమారు రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో పాటు.. ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారి సంఖ్య కూడా పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీ లివ్ సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఆగస్టు 21 నుంచి ఈ సినిమా ఓటీటీలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే అధికారిక స్ట్రీమింగ్ తేదీపై మేకర్స్ లేదా ఓటీటీ సంస్థ నుంచి స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ 'చెన్నై లవ్ స్టోరీ' స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు, ఇప్పటికే చూసి మరోసారి సినిమా చూడాలనుకునేవారికి ఓటీటీ రిలీజ్ మంచి అవకాశంగా మారనుంది. 'చెన్నై లవ్ స్టోరీ' కథ విషయానికి వస్తే.. నివి అనే యువతి తన ప్రియుడు అజయ్‌ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. పెళ్లికి సిద్ధమవుతున్న సమయంలో అజయ్ తనకు మరో అమ్మాయి అంటే ఇష్టమని చెప్పి ఆమెతో విడిపోతాడు. ఊహించని బ్రేకప్‌తో నివి తీవ్రంగా కుంగిపోతుంది. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆమె స్నేహితులు నివిని చెన్నైకి తీసుకెళ్తారు. కానీ అక్కడ కూడా ఆమె తన గతాన్ని మర్చిపోలేకపోతుంది. క్రమంగా మద్యానికి బానిసగా మారుతుంది. అదే సమయంలో అనుకోకుండా ఆమె జీవితంలోకి స్టీవెన్ శంకర్ అనే యువకుడు వస్తాడు. అనాథ అయిన స్టీవెన్‌కు డైరెక్టర్ కావాలన్నది కల. నివి స్నేహితుల గ్యాంగ్ అతడికి ఆశ్రయం కల్పిస్తుంది. మొదట్లో స్టీవెన్ చేసే పనులు, అతడి ప్రవర్తన నివికి చిరాకు తెప్పిస్తాయి. అయితే కాలక్రమంలో స్టీవెన్ మాటలు, అతడి ఆలోచనా విధానం నివిలో మార్పు తీసుకొస్తాయి. తన గత ప్రేమ వైఫల్యం నుంచి నెమ్మదిగా బయటపడిన నివి.. స్టీవెన్‌కు దగ్గరవుతుంది. ఇద్దరి మధ్య ప్రేమ మొదలవుతుంది. అయితే అప్పుడే నివి గతం మరోసారి ఆమె ముందుకు వస్తుంది. అజయ్ మళ్లీ ఆమె జీవితంలోకి ఎందుకు వచ్చాడు? నివి, స్టీవెన్‌ల ప్రేమకు ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? చివరకు నివి ఎవరిని పెళ్లి చేసుకుంది? అనే అంశాలతో కథ ఆసక్తికరంగా సాగుతుంది. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించారు. త్రిగుణ్, దేవీ ప్రసాద్, సిరి హన్మంతు, పి. వాసు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాతో రవి నంబూరి దర్శకుడిగా పరిచయం అయ్యారు.




# విజయ్ సేతుపతి 'స్లమ్ డాగ్' నుంచి అదిరిపోయే అప్డేట్.. ఇంటెన్స్ లుక్‌లో టబు !

కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్'పై మరోసారి ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన సమయంలోనే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలం పాటు చిత్రబృందం నుంచి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమాపై చర్చ కూడా తగ్గిపోయింది. తాజాగా మేకర్స్ మళ్లీ ప్రమోషన్ మొదలుపెట్టడంతో 'స్లమ్ డాగ్' మరోసారి వార్తల్లో నిలుస్తోంది. ఈ సినిమా నుంచి తాజాగా సీనియర్ నటి టబుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న టబును 'గౌరి హెగ్డే' అనే పాత్రలో పరిచయం చేశారు. పోస్టర్‌ను పరిశీలిస్తే టబు పాత్ర సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందనే ఆసక్తి కలుగుతోంది. ఆమె పాత్ర స్వభావం, కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతుందనే విషయాలను మాత్రం మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. అంతేకాదు.. టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సాలిడ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్‌కు విజయ్ సేతుపతి నటన తోడవడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే మంచి బజ్ ఉంది. ఈ సినిమాను జేబీ మోషన్ పిక్చర్స్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఇప్పటివరకు ఆలస్యం కారణంగా సైలెంట్‌గా ఉన్న 'స్లమ్ డాగ్' నుంచి వరుస అప్‌డేట్స్ రాబోతున్నట్లు తెలుస్తోంది. టబు గ్లింప్స్‌తో మొదలైన ఈ కొత్త ప్రమోషన్ క్యాంపెయిన్.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌తో సినిమాపై హైప్‌ను పెంచే అవకాశం ఉంది

PUBLISHED AND OWNER BY AVANAGANTI ANIL KUMAR Published at 3-83/A, BADANGPET, BALAPUR, RANGAREDDY District TELANGANA - 500058. Printed at SMILYSONLINE 6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District, TELANGANA - 500070. EDITOR AVANAGANTI ANIL KUMAR PRGI NO. : TGTEL/26/A2290 , CELL : 9133444314